

అధైర్యపడొద్దు.. అర్హులకే దివ్యాంగ పింఛను : కలెక్టర్

బాపట్ల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): అర్హత కలిగిన ప్రతి దివ్యాంగుడికి పింఛను సౌకర్యం కల్పిస్తామని, ఎవరూ అధైర్య పడొద్దని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. కలెక్టరేట్ లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో దివ్యాంగులు పెన్షన్ కోసం అధికంగా దరఖాస్తు చేశారని, దివ్యాంగుల పింఛన్లను అనర్హులు పొందుతున్నారనే ఉద్దేశంతోనే.. ప్రభుత్వం సదరం సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టిందన్నారు. సర్టిఫికెట్ల పరిశీలనకు ఒక తేదీని కేటాయించి.. దివ్యాంగులకు తెలియజేస్తామని చెప్పారు.ఆ తేదీల్లో పునఃపరిశీలన కేంద్రాలకు వెళ్లి.. డాక్టర్లతో పరీక్ష చేయించుకోవాలని పేర్కొన్నారు.

అధ్యక్ష పదవి కోసం పోటాపోటీ

- త్రిసభ్య కమిటీతో ఆశావహుల భేటీ
- హాజరైన మంత్రులు, ఎమ్మెల్యేలు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

బాపట్ల లోక్‌సభ టీడీపీ అధ్యక్షుడి ఎంపిక కసరత్తు మొదలైంది. ఇందుకు సంబంధించిన పరిశీలన, అభిప్రాయ సేకరణ, ఆశావహుల వినతులను స్వీకరించడానికి పార్టీ అధిష్టానం నియమించిన త్రిసభ్య కమిటీ సోమవారం బాపట్లలోని టీడీపీ కార్యాలయానికి వచ్చింది. శాసనమండలి చీఫ్‌విప్ అనురాధతో పాటు నేతలు వీరంకి గురుమూర్తి, మన్నె సుబ్బారెడ్డిలు ఇందులో సభ్యులుగా ఉన్నారు. వీరితో పాటు మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యేలు నక్కా ఆనంద్‌బాబు, వేగేశన నరేంద్రవర్మ, కొండయ్య, బీఎన్ విజయ్ కుమార్‌లు కూడా త్రిసభ్యకమిటీతో సమావేశమై అధ్యక్షుడి ఎంపికలో తమ అభిప్రాయాన్ని పంచుకున్నారు. బాపట్ల లోక్‌సభ పరిధిలోని ఏడు నియోజకవర్గాల నుంచి వచ్చిన మండల స్థాయి నేతలతో సమావేశం అనంతరం విడివిడిగా ఆశావహుల నుంచి వినతులు స్వీకరించారు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అనగాని సత్యప్రసాద్, వేదికపై మంత్రి గొట్టిపాటి రవి, చీఫ్‌విప్ అనురాధ, ఎమ్మెల్యే వేగేశన, కొండయ్య తదితరులు

భారీ సంఖ్యలో ఆశావహులు...

త్రిసభ్యకమిటీతో పాటు జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్యేల ముందు హాజరై తమ పేర్లను బాపట్ల లోక్‌సభ టీడీపీ అధ్యక్ష పదవికి పరిశీలించాలనే వినతులు పెద్ద సంఖ్యలో అందాయి. దాదాపు 20 పేర్లు తుది పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. రేపల్లెకు చెందిన గూడపాటి శ్రీనివాసరావు, చీరాలకు చెందిన విద్యాసంస్థల అధినేత పొగడదండ రవికుమార్, మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచుగరటయ్యలతో పాటు మొత్తం 20 మంది వరకు నేతలు లోక్‌సభ టీడీపీ అధ్యక్ష పీఠంపై కన్నేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుత అధ్యక్షులు సలగల రాజశేఖర్‌బాబు మరోమారు తనకు అవకాశం ఇవ్వాలని కూడా కోరినట్లు సమాచారం. అధ్యక్ష పదవికోసం వచ్చిన విజ్ఞప్తులన్నింటినీ పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళతామని, తుది నిర్ణయం అక్కడే జరుగుతుందని త్రిసభ్యకమిటీ ఆశావహులకు స్పష్టం చేసింది

రక్షణ వలయంలా నిలిచారు..

బాపట్ల లోక్‌సభ స్థానం టీడీపీ అధ్యక్ష ఎంపికకు పరిశీలకురాలిగా అధిష్టానం నియమించిన ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, జిల్లా నేతలతో తనకున్న అనుబంధాన్ని ఈ సమావేశం వేదికగా గుర్తు చేసుకున్నారు.


గత ప్రభుత్వం ఎంతగా అధికార దుర్వినియోగానికి పాల్పడ్డ తనను ఎమ్మెల్సీగా గెలిపించడంలో బాపట్ల జిల్లా నేతలు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికు మార్, ఏలూరి సాంబశివరావులు కీలకంగా పనిచేశారని అనురాధ అన్నారు. ఓ దశలో వైసీపీ నేతలు తనపై దాడికి పాల్పడతారనే సమాచారంతో వీళ్లంతా తనకు రక్షణ వలయంలా నిలుచున్నారని గుర్తు చేసుకున్నారు. కోటికి పైగా సభ్యత్వాలు ఉన్న ఏకైక పార్టీ టీడీపీ అని మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. పార్టీ పదవుల కేటాయింపుల్లో సామాజిక సమీకరణాలతో పాటు మరెన్నో అంశాలు కీలకంగా ఉంటాయని మంత్రి తెలిపారు. టీడీపీ అధ్యక్ష ఎంపిక కోసం పార్టీ అధిష్టానం కొన్ని గైడ్ లైన్స్ ఇచ్చిందని వాటి ఆధారంగానే ఎంపిక ఉంటుందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. తమతో సహా అందరూ త్రిసభ్య కమిటీ ముందు తమతమ అభిప్రాయాలు చెబితే వాటిని పార్టీ అధిష్టానం దృష్టికి వారు తీసుకెళ్లడం జరుగుతుందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు.

సామాజిక సమీకరణాలే కీలకం..

లోక్‌సభ స్థానం టీడీపీ అధ్యక్ష ఎంపిక అంశం సామాజిక సమీకరణాలతో పాటు ఆయా నియోజకవర్గాల్లో ఇప్పటికే ఇచ్చిన పదవుల దామాషాను కూడా పరిశీలనలోకి తీసుకోవడం జరుగుతుందని తెలుస్తోంది. జిల్లాలో చూసుకుంటే ఆరు నియోజకవర్గాలు ఉండగా, లోక్‌సభ స్థానం వచ్చేసరికి ప్రకాశం జిల్లాలోని సంతనూతలపాడు కూడా దీనిలో భాగంగా ఉంటుంది. పార్టీ పదవుల్లో నియోజకవర్గాల దామాషాను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ సోమవారం నాటి సమావేశంలో బాహాటంగానే చెప్పారు. ఈ అంశంతో పాటు ఆయా నియోజకవర్గాల్లో ఇప్పటికే ఇచ్చిన నామినేటెడ్ పదవుల సంఖ్య కూడా పార్టీ పదవుల కేటాయింపుల్లో ప్రధాన భూమిక పోషించనున్నట్లు సమాచారం.

అన్నదాతకు.. అంతులేని కష్టం!

- జిల్లా వ్యాప్తంగా 25,000 ఎకరాల్లో పైరుకు నష్టం
- రాయితీపై విత్తనాలు అందించే ప్రయత్నాల్లో ప్రభుత్వం
- మండలాలవారీగా ఇండెంట్ అడుగుతున్న వ్యవసాయ శాఖ



బాపట్ల: ముంపు బారిన పడిన వరి పైరు (పాత చిత్రం)

ఇటీవల కురిసిన ఎడతెరిపి లేని వర్షాలు అన్నదాతలకు తీరని ఆవేదనను మిగిల్చాయి. వెద పద్ధతిలో సాగు చేసిన వరిపైరు మొత్తం వర్షార్పణమైనట్లేనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజుల వయసున్న వరి పైరు ముంపు బారిన పడడంతో పాటు, దాదాపు నాలుగైదు రోజులు నీళ్లల్లోనే పైరు ఉండడంతో మొత్తం కుళ్లిపోయి పనికిరాకుండా పోయిందని, ఎకరాకు దాదాపు రూ.10,000 వరకు ఖర్చు చేశామని రైతులు వాపోతున్నారు.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

వ్యవసాయశాఖ ప్రాథమిక లెక్కల ప్రకారం జిల్లా వ్యాప్తంగా 16,325 హెక్టార్లలో పైరు ముంపుబారిన పడిందని తేల్చి ప్రభుత్వానికి నివేదించింది. ఇందులో 85 శాతం వాటా వరిదే ఉంది. తుది లెక్కల ప్రకారం దాదాపు 25,000 ఎకరాల్లో పైరు పూర్తిగా దెబ్బ తిన్నదని తేల్చారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పైరును ఈ క్రాప్ చేయాలన్నా కూడా కనీసం మూడు వారాల సమయం ఉండాలి. ముంపుబారిన పడిన పైర్లలో ఎక్కువశాతం పది రోజుల లోపు సాగు చేసినవే ఉండడంతో ఈ క్రాప్ నమోదుకు కూడా అవకాశం లేకుండా పోయింది. దీంతో ప్రభుత్వం అన్నదాతలను ఆదుకోవడానికి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించింది. దీనిలో భాగంగా ముంపు బారిన పడి నష్టపోయిన రైతాంగానికి విత్తనాలను రాయితీపై అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మండలాల వారీగా ఏ మేరకు విత్తనాలు అవసరమవుతాయో లెక్క తేల్చే పనిలో వ్యవసాయశాఖ నిమగ్నమయి ఉంది. ఇదిలా ఉంటే వారం రోజుల వ్యవధిలో ఇద్దరు కౌలు రైతులు ఆత్మహత్యకు పాల్పడడం ఆందోళన కలిగించేదిగా ఉంది. అన్నదాతలెవరూ అధైర్య పడవద్దని, పైరు నష్టపోయిన వారిని ఆదుకోవడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, దానిలో భాగంగానే రాయితీపై విత్తనాలు అందించడానికి కసరత్తు జరుగుతోందని వ్యవసాయశాఖ చెబుతోంది

తక్కువ పెట్టుబడి అని వెద సాగుకు...

నానాటికీ వ్యవసాయం జూదంగా మారుతున్న తరుణంలో తక్కువ పెట్టుబడితో సాగు చేయొచ్చని అధికశాతం రైతాంగం ఈ ఖరీఫ్‌లో వెద సాగువైపు మొగ్గింది. వ్యవసాయశాఖ తుది లెక్కల ప్రకారం తాజా ముంపుకు జిల్లా వ్యాప్తంగా 25,000 ఎకరాల్లో పైరు దెబ్బ తిన్నట్లు తేల్చింది. ఇందులో దాదాపు 16,000 ఎకరాల వరకు వరిపైరు వెద పద్ధతిలో సాగు చేసిందే ఉండడం గమనార్హం. వెద పద్ధతిలో అయితే నీటి వినియోగం తక్కువగా ఉండడంతో పాటు కూలీల అవసరం పెద్దగా ఉండకపోవడంతో పాటు పంట కూడా ముందుగానే కోత కు వస్తుందని, తద్వారా ప్రకృతి విపత్తుల నుంచి తప్పించుకోవచ్చనేది అన్నదాతల ఆలోచనగా ఉండి ఆ దిశగా అడుగులేశారు. కానీ విరుచుకుపడిన వర్షాలు ఆదిలోనే పైరును దెబ్బతీశాయి. అదే నారు విధానం ద్వారా సాగు చేసి ఉంటే పైరుకు నెల రోజుల వ్యవధి ఉండేదని, ఈ ముంపు వల్ల పెద్దగా నష్టం ఉండేది కాదని రైతులు వాపోతున్నారు.

రాయితీ విత్తనాలపై కసరత్తు...

ముంపు బారిన పడి పైరు నష్టపోయిన రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. దీనిలో భాగంగా రాయితీపై రైతులకు విత్తనాలను అందించడానికి ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇప్పటికే మండలాల వారీగా ఎంత పరిమాణంలో విత్తనాలు అవసరమవుతాయో నివేదిక పంపాలనే ఆదేశాలు కమిషనరేట్ నుంచి వ్యవసాయశాఖకు అందాయి. మండలాల పరిధిలో సిబ్బంది రైతుల నుంచి వివరాలు సేకరించే పనిలో నిమగ్నమయింది.

ఇదేం పంచాయితీ!

సందట్లో సడేమియా!

ఎప్పుడైతే ఇంటి పన్ను పెంచమని ప్రభుత్వం చెప్పిందో పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని కొందరు పంచాయతీ కార్యదర్శులు మెదడుకు పదును పెట్టారు. 2000 నుంచి ఆస్తి పన్ను పెంపు లేదు కాబట్టి తాజా మార్కెట్ విలువ ప్రకారం పన్ను పెంచేందుకు సిద్ధం అయ్యారు. సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలను సంప్రదించి.. పలు దఫాలు పెరిగిన మార్కెట్ విలువలను ఆధారంగా ఇంటి పన్ను భారీగా పెంచారు. ఉదహరణకు గతంలో రూ.300 మాత్రమే ఉన్న ఇంటి పన్ను తాజా మార్కెట్ రేటు ప్రకారం రూ.1,300 వరకు వెళ్లింది. ఈ విధంగా పన్ను పెంచుతున్నారన్న సమాచారం బయటకు పొక్కడంతో తీవ్ర దుమారం రేగింది.



- 'స్వర్ణ పంచాయతీ' కార్యక్రమంలో పన్ను పోటు
- శిక్షణ లేక.. జీఓలు అర్థం కాని కార్యదర్శులు
- ఎడా పెడా పన్ను పెంచేసిన వైనం
- ప్రభుత్వ ఆదేశాలతో మళ్లీ అసెస్మెంట్‌ల సమీక్ష
- పెంపు 5 శాతమే ఉండే విధంగా ఆదేశాలు

ఒక పథకం ప్రారంభించే ముందు.. దానిని ప్రజల్లోకి తీసుకెళ్లే ఉద్యోగులకు సరైన శిక్షణ ఇవ్వకుంటే ఎటువంటి ప్రతికూల పరిస్థితులు ఎదురవుతాయో.. కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిన 'స్వర్ణ పంచాయతీ' కార్యక్రమం ఒక మంచి ఉదాహరణ. జీవోలోని అసలు విషయం అర్థం కాక.. పంచాయతీ కార్యదర్శులు ఎడాపెడా ఆస్తి పన్ను పెంపునకు సిద్ధం కావడంతో.. గ్రామీణ ప్రజల్లో ఒక దుష్ప్రచారానికి, ఆందోళనకు కారణమైంది. దీంతో ఉన్నతాధికారులు అప్రమత్తమై.. దిద్దుబాటు చర్యలు చేపట్టారు. పన్ను పెంపు జరిగిన చోట అసెస్మెంట్ల ఆన్‌లైన్ ప్రక్రియకు బ్రేకులు వేశారు.

బాపట్ల, ఆగస్టు 25 (ఆంధ్ర జ్యోతి): గతంలో కేవలం రూ. 250 మాత్రమే ఉన్న ఇంటి పన్ను ఒకేసారి రూ.1000 అయ్యింది. అసాధారణ పన్ను పోటుతో గ్రామీణ ప్రజలు బేంబేలెత్తి పో యారు. రాష్ట్ర ప్రభుత్వం ఒక మంచి ఉద్దేశంతో ప్రవేశ పెట్టిన స్వర్ణ పంచా యతీ కార్యక్రమంలో ఈ పరిణామం చోటు చేసుకుంది. ప్రభుత్వం చెప్పిన సంగతిని పంచాయతీ కార్యదర్శులు సరి గా అర్థం చేసుకోకపోవడంతో ఉమ్మ డి గుంటూరు జిల్లాలోని 1,172 గ్రామ పం చాయతీల్లో ఆందోళన నెలకొంది. అయితే ఉన్నతాధికారులు అప్రమత్తం కావడంతో.. దిద్దుబాటు చర్యలు చేపడుతున్నారు.

ముందుగానే భారీ ప్రచారం?

స్వర్ణ పంచాయతీ కార్యక్రమం.. కార్యాలయాలకే పరిమితమైంది. కానీ, పన్ను బాగా పెంచేశారన్న ప్రచారం భారీగా జరిగింది. ప్రజలపై భారం మోపుతున్నారంటూ వైసీపీ దుష్ప్రచారం ప్రారంభించింది. ప్రజలకు ఇంటి పన్ను పెంపు నోటీసులు ఇవ్వకుండానే ఈ భారీ ప్రచారం పట్ల ప్రభుత్వ వర్గాలు కూడా ఆశ్చర్య పడుతున్నాయి. క్షేత్రస్థాయి సిబ్బంది కొందరు వైసీపీకి లబ్ధి చేకూర్చేందుకు ఈ ప్రచారం అమల్లోకి తెచ్చినట్లు తెలుస్తోంది.

అసలు ఉద్దేశం ఇదీ..

ఈ ఏడాది జనవరిలో స్వర్ణ పంచాయతీ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభు త్వం శ్రీకారం చుట్టింది. ఇంటి పన్ను ఆన్‌లైన్‌లో చెల్లించే అవకాశం కల్పిం చింది. అది కూడా నేరుగా పంచాయతీ జనరల్ ఫండ్‌లో జమ కావడంతో.. ఎప్పుడు కావాలంటే అప్పుడు నగదు డ్రాచేసుకొని వినియోగించుకునే వీలు కల్పించింది. అందులో భాగంగా ప్రతి ఇంటికి మళ్లీ కొలతలు తీసుకొని జీవోకు లోబడి పన్ను పెంపు జరగాలని పంచాయతీ కార్యదర్శులను ప్రభుత్వం (మిగతా 8వ పేజీలో)

బిల్లు.. జేబుకు చిల్లు

- మళ్లీ మొదటికి 'పల్లె పండుగ' బిల్లుల చెల్లింపులు
- ఉమ్మడి జిల్లాల్లో రూ.78 కోట్ల బకాయిలు
- ఎనిమిది నెలలుగా తప్పని ఎదురు చూపులు

(అద్దంకి- ఆంధ్రజ్యోతి)

'పల్లె పండుగ బిల్లుల చెల్లింపు విధానం మళ్లీ మొదటికొచ్చింది. ఉపాధి హామీ పథకం నిధుల తో పల్లెల్లో పెద్ద ఎత్తున ప్రగతి పనులు చేపట్టిన వారి జేబులకు చిల్లు పడేలా కనిపిస్తోంది. ప్రతి గురువారం చెల్లింపులు చేపడతామన్న ప్రభుత్వ హామీ రెండు వారాలకే పరిమితమైంది. పనులు చేస్తే వెంటనే సొమ్ములు వస్తాయని కూటమి నేతలు అప్పులు చేసి సీసీ రోడ్లు, మురుగు కాల్వలు, పాఠశాలల ప్రహరీల నిర్మాణం వంటి పనులను పల్లెల్లో పెద్ద ఎత్తున చేశారు. పనులు పూర్తయ్యి 8 నెలలు గడుస్తున్నాయి. పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లో సూమారు రూ.78 కోట్ల విలువైన బిల్లుల కోసం ఎదురు చూపులు తప్పడం లేదు. బిల్లులు ఇప్పించాలని కొన్ని చోట్ల ఎమ్మెల్యేలపై నేతలు ఒత్తిడి తెస్తున్నారు. ఈ పథకం ప్రారంభంలో మొదటి రెండు వారాలు బిల్లుల చెల్లింపులు సక్రమంగా జరిగాయి. అనంతరం పల్నాడు జిల్లాలో రూ.47 కోట్లు, బాపట్ల జిల్లాలో రూ.23 కోట్లు, గుంటూరు జిల్లాలో రూ.8 కోట్లు బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరుగుతుండటంతో పనులు చేపట్టిన వారిలో ఆందోళన వ్యక్తమవుతోంది. బిల్లులు చెల్లించి తమను అప్పుల ఊబి నుంచి బయట పడేయాలని కోరుతున్నారు.



గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణం

మళ్లీ మొదటికి..

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పార్టీ ద్వితీయ శ్రేణి నేతలు ఉపాధి హామీ పథకం కింద పనులు చేసి, బిల్లులు రాక చేతులు కాల్చుకున్నారు. ప్రస్తుతం అందులో చాలా మంది పల్లె పండుగ పథకం పనులు చేపట్టారు. పాత బిల్లుల మాట ఎలా ఉన్నా.. కొత్త బిల్లులు కూడా నిలిచిపోవడంతో.. పరిస్థితి మళ్లీ మొద టికొచ్చిందని వారు భావిస్తున్నారు. పనులకు డబ్బులు ఖర్చు పెట్టి అప్పులు పాలయ్యామని, వడ్డీలు కట్టలేక పోతున్నామని పార్టీ నేతలు ఆవేదన వక్తం చేస్తున్నారు.

నాడు-నేడు పనులకు...
వీడని గ్రహణం


- నిలిచిపోయిన 40 పాఠశాలల నిర్మాణ పనులు

వేమూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : వేమూరు నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలో వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన నాడు-నేడు పనులకు గ్రహణం వీడలేదు. అప్పట్లో మొత్తం 40 పాఠశాలల్లో నిర్మాణాలను ప్రారంభించారు. వాటిలో వేమూరు మండలంలోని ఒక్క పాఠశాల నిర్మాణం పూర్తయింది. మిగతా వాటిలో నిర్మాణాలు ప్రారంభించి వివిధ దశలో నిలిపి వేశారు. దీంతో పాత భవనాలు దెబ్బతిని నిర్వహణకు ఇబ్బంది పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నాడు నేడు స్థానంలో మనబడి మన భవిష్యత్తు అనే పేరుతో ఈ పథకాన్ని ప్రారంభించారు. నిర్మాణ పనులకు రాష్ట్ర ప్రభుత్వమే నిధులు కేటాయించాలి. నిర్మాణం పూర్తికాగానే చేపట్టాల్సిన ద్వారబంధాలు, కిటికీలు రంగులు వేసేందుకు కేంద్ర ప్రభుత్వం నుండి నిధులు అందాల్సి ఉన్నాయి. ఈ నిర్మాణం పనులు వైసీపీ పాలనలో పూర్తి కావాల్సి ఉండగా, ఆ ప్రభుత్వం సకాలంలో సక్రమంగా నిధులు విడుదల చేయకపోవడం వల్ల ఇబ్బందులు ఏర్పడి పనులు సాగలేదు. అమృతలూరు మండలంలో ఐదు పాఠశాలల పనులు పూర్తి కాలేదు. వేమూరు మండలంలో 14 పనులకు గాను ఒక పని మాత్రమే పూర్తయ్యింది. 13 పాఠశాలలకు నిధులు విడుదల కాని కారణంగా నిర్మాణాలు వివిధ దశల్లో నిలిచిపోయాయి. కొల్లూరు మండలంలో ఒక పాఠశాల నిర్మాణానికి కూడా నిధులు రాలేదు. భట్టిప్రోలు మండలంలో 9 పాఠశాలలకు గాను రెండు నిర్మాణాలను అసలు ప్రారంభించకపోగా ఏడు పనులు వివిధ దశల్లో నిలిచిపోయాయి. చుండూరు మండలంలో 11 పనులకు గాను ఒక పనిని అసలు ప్రారంభించకపోగా 11 పనులు వివిధ దశల్లో ఆగిపోయాయి. ప్రభుత్వం మారింది కానీ కొన్ని చోట్ల పర్యవేక్షణ విషయంలో రాకపోవడంతో కూడా కొన్ని నిర్మాణాలకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం విడుదల చేయాల్సిన నిధులను విడుదల చేయకపోగా కొన్ని టెండర్లను పిలిచేందుకు కూడా ముందుకు రాకపోవడంతో తుది దశలో నిర్మాణ పనులు నిలిచిపోయి ఆయా పాఠశాలలు ప్రారంభానికి నోచుకోకుండా ఉన్నాయి. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం వీటిపై దృష్టి నిర్మాణాలను పూర్తి చేయించి పాఠశాలల నిర్వహణ విషయంలో ఇబ్బందులు లేకుండా కొనసాగించేందుకు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి.



ప్రారంభానికి నోచుకోని వేమూరులోని ప్రాథమిక పాఠశాల భవనం

వరదలతో.. రోడ్లు గుంతలమయం



గొరిగెపూడి కరకట్టనుంచి పెసర్లంక వెళ్లే రహదారి దుస్థితి

రేపల్లె, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన వర్షాలకు లంక గ్రా మాల్లోని రోడ్లు గుంతలమయంగా మా రాయి. చిన్న రేవు వద్ద వచ్చిన వరద కారణంగా కట్టలు రెండువైపులా కోతలకు గురికావటంతో రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతున్నది. ఓలేరునుంచి పెసర్లకం వెళ్ళే రహదారంతా భారీస్థాయిలో గుంతలు ఏర్పడ్డాయి. తారురోడ్డు కొట్టుకుపోయి కంకరరాళ్ళు పైకి తేలాయి. చిన్నరేవులో వరదనీరు తగ్గకపోవటంతో రాకపోకలు నిలిచాయి. ఈ రహదారంతా ఛిద్రమైపోయింది. గొరికపూడినుంచి పెసర్లంక వెళ్ళే తారురోడ్డు గుంతలుపడి రాకపోకలకు తీవ్ర ఆటంకంగా మారింది. అధికారులు దృష్టి సా రించాలని లంక గ్రామాల ప్రజల విన్నవిస్తున్నారు.

మల్లేశ్వరుని దర్శించిన జిల్లా జడ్జి దంపతులు



గుంటూరు జిల్లా జడ్జి జస్టిస్ బీ సాయికళ్యాణచక్రవర్తి దంపతులకు జ్ఞాపిక అందజేస్తున్న ఆలయ ఉప కమిషనర్ గోగినేని లీలా కుమార్

పెదకాకాని, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పెదకాకానిలోని శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి దేవస్థానాన్ని, గుంటూరు జిల్లా జడ్జి జస్టిస్ బీ సాయి కళ్యాణ చక్రవర్తి దంపతులు సోమవారం దర్శించారు. ఆలయ మర్యాదలతో జస్టిస్ దంపతులకు అధికారులు ఘన స్వాగతం పలికారు. ఆలయంలో మల్లేశ్వర స్వామి వారికి, భ్రమరాంబ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిపించారు. జస్టిస్ దంపతులను శేష వస్త్రముతో సత్కరించి స్వామివారి తీర్థప్రసాదాలు ఆలయ ఉప కమిషనర్ లీలా కుమార్ అందజేశారు.

మాట నిలబెట్టుకున్న లోకేశ్ : జీవీ

వినుకొండ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : మంత్రి లోకేశ్ రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కూటమి ప్ర భుత్వం వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ ఫైల్ మీదనే తొలి సంతకం పెట్టగా, తదనంతర కసరత్తులు పూర్తి చేసి పగడ్బందీగా, పారదర్శకంగా భారీ డీఎస్సీని నిర్వహించడం, వారాల వ్యవధిలో ఫలితాలు ప్రకటించడం చారిత్రక సం దర్భమన్నారు. విద్యారంగాన్ని బలోపేతం చేయడానికి, పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతను తీర్చడానికి ఇదొక మైలురాయిగా నిలుస్తుందన్నారు. "ఇది కేవలం ఉద్యో గాల భర్తీ కాదు, వేలాది కుటుంబాల భవిష్యత్తు నిర్మాణం" అని ఆయన అన్నారు. యువతకు ఉద్యోగాలు ఇవ్వడంపై కడుపుమంటతో రగిలిపోయిన వైసీపీ అధ్యక్షుడు జగన్ డీఎస్సీకి వ్యతిరేకంగా 24కేసులు వేయించినా అన్నీ అధిగమించి ప్రక్రియ పూర్తిచేసిన ఘనత పూర్తిగా మంత్రి లోకేశ్‌కే చెందుతుందన్నారు. ఇకపై ఏటా డీఎస్సీ నిర్వహిస్తామని హామీలో నిరుద్యోగ వర్గాలకు మరింత తీపి కబురు చెప్పినందుకు వ్యక్తిగత ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. రాష్ట్రంలో అత్యధిక డీఎస్సీలు నిర్వహించిన ఘనత కూడా తెలుగుదేశం పార్టీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. దీనికి పూర్తి విరుద్ధమైన రీతిలో పాలన సాగించిన జగన్ రెడ్డి అయిదేళ్ల వైసీపీ ప్రభుత్వం లో ఒక్క టీచర్ పోస్ట్ కూడా భర్తీ చేయకుండా పాఠశాల విద్యను నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. ఫలితంగానే అంతకు ముందు నాణ్యమైన విద్యలో 3వ స్థానంలో ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను 19 స్థానానికి పడేసిన ఘనుడు జగన్ రెడ్డని ఎద్దేవా చేశారు. ప్రభుత్వబడులకి రంగులు మార్చడం తప్ప అతడు చేసింది శూన్యమని, పైగా టీచ ర్లపై కక్షగట్టి కేసులు పెట్టి వేధించి దుర్మార్గపు పాలనను 2019-24 మధ్య రాష్ట్రంలో చూశామన్నారు. మళ్లీ ఇంతకాలానికి కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ బడులకు టీచర్లు వస్తున్నారని, వారికి ప్రతినెలా 1వ తేదీనే జీతాలు అందుతున్నాయని.. అందుకు ప్రతి ఒక్కరు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు.

గురజాల డీసీసీబీ అక్రమాలపై విచారణ

సెప్టెంబరు 22 నాటికి ముగించాలని ప్రభుత్వ ఆదేశం

గుంటూరు సిటీ, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో అనేక అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్న పల్నాడు జిల్లా గురజాల డీసీసీబీ (జిల్లా సహకార కేంద్ర బ్యాంకు) బ్రాంచ్ అక్రమాలపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. విచారణను సెప్టెంబరు 22 నాటికి పూర్తి చేయాలని వ్యవసాయ శాఖ ఎక్స్ అఫీషియో కార్యదర్శి బుడితి రాజశేఖర్ సోమవారం జీఓ 742 విడుదల చేశారు. గురజాల డీసీసీబీ శాఖలో సుమారు రూ. 11 కోట్ల అక్రమాలు జరిగినట్లు గతంలో ఆరోపణలు వెలువెత్తాయి. బ్రాంచ్ పరిధిలోని కోల్డ్ స్టోరేజ్ పేరిట కూడా భారీ మోసం జరిగింది. రైతులకు తెలియకుండానే వారి పేర్లతో రుణాలు పొందటం, స్టాక్ మాయం చేయటం వంటి అక్రమాలు చోటు చేసుకున్నాయి.

వ్యవసాయ శాఖ దాడులు

రూ.3.68 కోట్ల పురుగుమందుల అమ్మకాల నిలిపివేత



ఆటోనగర్‌లోని పురుగు మందుల తయారీ కేంద్రంలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

గుంటూరు సిటీ, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): అసలు ఆ పురుగు మందులకు ఏ విధమైన అనుమతి లేదు.. కొన్నేమో కాలం చెల్లినవి.. కొన్నేమో ప్రభుత్వం నిషేధించినవి.. పోనీ షాపులకేమైనా సరైన అనుమతులు ఉన్నాయా అంటే.. అదీ లేదు. మరి ఇన్నేళ్లుగా వేల కోట్ల రూపాయల వ్యాపారం ఎలా చేస్తున్నారో అర్థం కావటం లేదు. ఏమీ లేకపోయినా దర్జాగా వ్యాపారం చేస్తున్న బడా వ్యాపారుల దందా వ్యవసాయశాఖ తనిఖీలలో గుట్టురట్టు అయ్యింది. గుంటూరు పట్టణంలోని పురుగు మందుల కంపెనీలను, డిస్ట్రిబ్యూటర్ షాపులను, గోడౌన్స్‌ను, డీలర్స్ దుకాణాలను వ్యవసాయశాఖ అధికారులు సోమవారం జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాష్ట్రంలో నిషేధం ఉన్న కలుపు మందును దిగుమతి చేసుకుంటూ పట్టుబడిన శబరి క్రాప్ కేర్ సైన్స్ ప్రయివేట్ లిమిటెడ్‌లో తొలుత తనిఖీలు నిర్వహించారు. అక్కడ రూ.1,45,61,542 విలువ చేసే 28,744 లీటర్ల పురుగు మందుల అమ్మకాలు నిలిపి వేస్తూ ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఆటోనగరలోని ధర్మాజ్ క్రాప్ గార్డ్, సుమిటోమో కెమికల్స్ ఇండియా, యునైటెడ్ పెస్టిసైడ్స్ రాయిపూర్, గోరంట్లలోని హిందూస్తాన్ ఆగ్రో ఇన్‌సెక్టిసైడ్స్‌లో తనిఖీలు నిర్వహించారు. ఈ దాడుల్లో రూ. 2.22 కోట్లు విలువ చేసే 62,418 లీటర్ల పురుగు మందుల అమ్మకాలు నిలిపి వేశారు. చాలా మంది వ్యాపారులు సరైన అనుమతి, పత్రాలు లేకుండానే పురుగు మందుల అమ్మకాలు జరిపినట్లు అధికారులు గుర్తించారు. ఈ దాడుల్లో డీడీఏ జీ లక్ష్మణకుమార్, ఏడీఏ లు జీ కల్యాణ్ కుమార్, సురేషన్, శశిధర్ రెడ్డి, గుంటూరు ఏడీఏ ఎన్ మోహన్ రావు, ఏఓలు కే వెంకటరావు, సుజాత, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

సాగర్ జలాశయానికి కొనసాగుతున్న వరద

● 26 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల



విజయపురిసౌత్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయానికి శ్రీశైలం నుంచి వరద ప్రవాహం కొనసాగుతోంది. సోమవారం శ్రీశైలం నుంచి 2,50,006 క్యూసెక్కుల వరద నీరు వస్తుండడంతో ప్రాజెక్ట్ అధికారులు 26 క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం నీటిమట్టం 585.10 అడుగులు ఉంది. ఇది 297.72 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9387 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7601 క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 33,576 క్యూసెక్కులు, 26 క్రస్ట్‌గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 1,96,742 ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 2,50,006 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు తగ్గిన వరద

రెంటచింతల,ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : సత్రశాలలోని కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జునసాగట్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు ఎగువన ఉన్న సాగర్ నుంచి వరద నీరు రావడం గణనీయంగా తగ్గినట్లు ఎస్ఈ కే వెంకటరమణ చెప్పారు. 11 రేడియల్ క్రస్ట్ గేట్లను 4 మీటర్ల మేర ఎత్తి దిగువన వున్న పులిచింతలకు 2,28,030 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామన్నారు.సాగర్ నుంచి 2,30,048 క్యూసెక్కుల నీరు రిజర్వాయర్‌కు చేరుతోందన్నారు.ప్రస్తుతం 74.40 మీటర్ల మేర నీరుండగా ఈ నీరు 6.080 టీఎంసీలకు సమానమన్నారు.విద్యుదుత్పత్తి నిలిపివేశారు.



11 క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

పులిచింతల సమాచారం

అచ్చంపేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో సోమవారం 37.32 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 2,59,230 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతోంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 16,600 క్యూసెక్కులు, లీకుల ద్వారా నాలుగు వందల క్యూసెక్కులు, నాలుగు గేట్ల ద్వారా 1,29,176 క్యూసెక్కులు, మొత్తం 1,46,176 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతున్నాయి.

పశ్చిమడెల్టాకు 8216 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమడెల్టాకు 8216 క్యూసెక్కుల నీరు సోమవారం విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం బ్యారేజి వద్ద 12.0 అడుగుల నీటిమట్టం ఉండగా దిగువకు 3,15,200లక్షల క్యూసెక్కులనీరు విడుదల చేస్తున్నారు. దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి హైలెవెల్‌ఛానల్‌కు 306 క్యూసెక్కుల నీరు, రేపల్లెకాల్వకు 1875 క్యూసెక్కులనీరు తూర్పుకాల్వకు 712 క్యూసెక్కుల నీరు, పశ్చిమకాల్వకు 292 క్యూసెక్కుల నీరు, నిజాంపట్నంకాల్వకు 528 క్యూసెక్కుల నీరు, కొమ్మమూరుకాల్వకు 2940 క్యూసెక్కులనీరు విడుదల చేస్తున్నారు.

దుగ్గిరాలయార్డులో పసుపు ధరలు

దుగ్గిరాల, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): దుగ్గిరాల పసుపుయార్డులో సోమవారం జరిగిన వేలంలో 224 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.9,950, గరిష్ఠధర రూ.10,825, మోడల్‌ధర రూ.10,575 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.9,980, గరిష్ఠధర రూ.10,861, మోడల్‌ధర రూ.10,450 పలికాయి.

రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి

ఈపూరు, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని వనికుంట సమీపంలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గురజాల మండలం జంగమేశ్వరపురానికి చెందిన శీలం ఏడుకొండలు(54) బైక్‌పై వినుకొండ వెళ్తున్నాడు. కుర్చేడు మండలం నాయుడుపాలేనికి చెందిన నాలా శ్రీను బైక్‌పై వస్తూ.. వనికుంట సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నారు. ఏడుకొండలు రోడ్డుపై పడి హెల్మెట్ కుడా పగిలి తలకు బలంగా దెబ్బతగిలడంతో చనిపోయాడు. శ్రీనుకు తీవ్ర గాయాలు కావడంతో వినుకొండ ఆసుపత్రికి తరలించారు. మృతుడు ఏడుకొండలు కోలాటాలకు డప్పు కొడుతుంటాడు. మృతుడికి బార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ సాంబయ్య తెలిపారు.

తాగునీరు అనుకుని..

విషద్రవం తాగి వ్యక్తి మృతి

ఈపూరు,ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): తాగు నీరు అనుకొని చెరువులో మురుగు శుభ్రం చేసే.. విష ద్రవం తాగి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని గుండేపల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన చెరువులో చేపలు పడుతున్నారు. చెరువు వద్ద విష ద్రవం ఉండే డబ్బాలోని నీటిని తాగు నీరు అనుకుని చేపలు పట్టడానికి వచ్చిన ఆకుల రామాంజినేయులు(25) తాగాడు. దీంతో అతను అక్కడే పడిపోవడంతో.. ఇతర చేపలు పట్టేవాళ్ల నర్సరావుపేట ప్రభుత్వాసుపత్రికి అతనిని తీసుకెళ్లారు. అక్కడి నుంచి గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా.. చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం రామాంజినేయులు మృతిచెందాడు. స్వగ్రామం నర్సరావుపేట శివసంజీవనగర్ కు మృతదేహాన్ని తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఈపూరు పోలీసులు తెలిపారు.

5.98 మెట్రిక్ టన్నుల ఎరువులు సీజ్

భట్టిప్రోలు (కొల్లూరు), ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు చేసి 5.98 మెట్రిక్ టన్నుల ఎరువులను సీజ్ చేశారు. సోమవారం భట్టిప్రోలులోని సోమశేఖర్ ఫెర్టిలైజర్స్ దుకాణంలో విజిలెన్స్ సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆకస్మి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫారం-ఓ లేని ఇన్‌క్లూజివ్ కానీ రూ.35,446 విలువైన 5.98 మెట్రిక్ టన్నుల ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏవో సీహెచ్.ఆదినారాయణ, ఏఓ బ్రహ్మారెడ్డి, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



ఎరువుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

అనుమానాస్పదస్థితిలో

ఇద్దరు యువకుల మృతి

పిడుగురాళ్ల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్లకు సమీపంలోని జానపాడు రైల్వే గేటు వద్ద సోమవారం ఇరువురు యువకులు మృత దేహాలను స్థానికులు గుర్తించారు.పోలీసుల కథనం ప్రకారం వారిని పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన ఇరువురు స్నేహితులు షేక్ షరీఫ్ (22), గరికపూడి ఏసుదాసు (35)గా గుర్తించారు. ఆదివారం రాత్రి 10.30 గంటల తరువాత ఒక వ్యక్తి నుంచి వచ్చిన ఫోన్ కాల్‌తో ఏసు దాసు ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడని, ఆ తరువాత ఏమి జరిగిందో తెలియలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. తెల్లవారిన తరువాత మృత దేహాలు రైల్వేట్రాక్ సమీపంలో వున్నట్లు తెలియడంతో కుటుంబసభ్యులు మృతదేహాలను చూసి అనుమానం వ్యక్తం చేస్తూ రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. షేక్ షరీఫ్ అదే ప్రాంతానికి అరగంట ముందు వచ్చినట్లు, అతనిని కూడా ఎవరో హత్య చేశారా ? లేక మరేదైనా జరిగిందా అన్న విషయం ప్రశ్నార్థకంగా వుంది. నడికూడి రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. అయితే కొందరు యువకుల మధ్య మద్యం మత్తులో గొడవ జరగటం వల్ల ఈ ఘటన జరిగినట్లు కుటుంబసభ్యులు రైల్వే పోలీసులకు తెలిపారు. అసలు ఘటన మద్యం మత్తులో గొడవ కారణంగా జరిగిందా.....లేక రైలు ప్రమాదమా అనేది పోలీసుల విచారణలో తేలనుంది. ఇరువురు యువకులు అనుమానాస్పదంగా మృతి చెందడంతో గాంధీనగర్ వాసులు దిగ్భ్రాంతికి గురయ్యారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



షేక్ షరీఫ్ (ఫైల్‌ఫొటో)



గరికపూడి ఏసుదాసు (ఫైల్‌ఫొటో)

48,590 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 50,261 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 48,590 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 9,501 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	10000	14200
నెంబరు. 5	10000	13500
273	10000	13600
341	10000	15000
4884	---	---
సూపర్ 10	---	---
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	15000
షార్క్-1	----	---
బ్యాడిగి 355	10000	14300
దేవనూరు డీలక్స్	10000	13500
ఆర్మూరు	9800	11500

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఏసీ కామన్ వెరైటీ		
334	9500	13800
నెంబరు. 5	10000	13500
273	----	----
341	11000	15200
4884	10000	13000
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	15000
బ్యాడిగి 355	10000	14000
దేవనూర్ డీలక్స్	10500	13600
ఆర్మూరు	---	---
తాలుకాయలు	5000	7600

నిరుద్యోగులకు కూటమి ప్రభుత్వం ఆశాజ్యోతి

ఇచ్చిన మాట నిలబెట్టి మెగా డీఎస్సీ : యరపతినేని

పిడుగురాళ్ల, ఆగస్టు 25 (ఆంధ్ర జ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం యువతకు ఇచ్చిన మాట ప్రకారం 16,347 టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహించడం జరిగిందని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇక ప్రతి ఏటా డీఎస్సీ నిర్వహిస్తూ యువ ఉపాధ్యాయులతో విద్యారంగాన్ని దేశంలోనే తొలిస్థానంలో నిలబెట్టేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. యువత బాగుపడటం, వారికి ఉద్యోగ అవకాశాలు రావడం ఇష్టంలేని జగన్ మెగా డీఎస్సీని ఆపేందుకు 24 కేసులు కోర్టు ద్వారా వేయించారని, వాటన్నింటిని అధిగమించి మెగా డీఎస్సీ ప్రక్రియను పూర్తిచేసిన ఘనత ఐటీ, విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్‌ది అన్నారు. 2014-19 మధ్య రెండు డీఎస్సీలు నిర్వహించి 18 వేల ఉపాధ్యాయ పోస్టులను ఆనాడు భర్తీ చేయడం జరిగిందని, చంద్రబాబునాయుడు 14 ఏళ్ల ముఖ్యమంత్రి హోదాలో 13 డీఎస్సీల ద్వారా లక్షా 80 వేల 208 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత సమగ్ర శిక్షణ సొసైటీ ఆధ్వర్యంలో కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో ఖాళీగా వున్న 729 నాన్‌టీచింగ్ పోస్టులను భర్తీచేసి 90 మంది ఎస్టీ యువతను కొత్త ఉపాధ్యాయులుగా నియమించడం జరిగిందన్నారు. 476 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 3,619 కాంట్రాక్ట్ లెక్చరర్ల సేవలను పునరుద్ధరణ చేయడం జరిగిందని, టీచర్లపై పని ఒత్తిడి తగ్గించేందుకు గత ప్రభుత్వ హయాంలో వున్న ఆరు రకాల బడుల విధానాన్ని కూటమి ప్రభుత్వం 9 రకాలుగా మార్చడం జరిగిందన్నారు. నాటి వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉపాధ్యాయులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడ్డారని, ఉపాధ్యాయులను మద్యం దుకాణాలకు కాపలాగా పెట్టించి పాఠశాలలో మరుగుదొడ్లు కడిగించారని అని ఎమ్మెల్యే యరపతినేని దుయ్యబట్టారు.

స్కూలు వ్యాను రేడియేటర్ పగిలి విద్యార్థులకు గాయాలు



చెరుకుపల్లి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): చెరుకుపల్లిలో విద్యార్థుల్ని ఎక్కించుకుని వెళుతున్న హోలీయర్ వరల్డ్ స్కూల్ వ్యాను రేడియేటర్ పగలడంతో దానిలోని వేడినీరు విద్యార్థుల కాళ్ళపై పడి ముగ్గురు విద్యార్థులు గాయాలపాలయ్యారు. గాయపడిన విద్యార్థులు చైతన్య, అఖిల్ 6వతరగతి చదువుతున్నారు. మరో విద్యార్థి నిషాల్ 9వ తరగతి చదువుతున్నాడు. గాయపడిన విద్యార్థులను వెంటనే దగ్గరలో ఉన్న ప్రయివేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. పెద్ద ప్రమాదం తప్పడంతో ఊపిరిపీల్చుకున్నారు. ఎస్ఐ టీ అనిల్‌కుమార్ విద్యార్థులను పరామర్శించి వివరాలు నమోదు చేసుకున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	111, 119, 130
చికెన్ విత్ స్కిన్(కిలో)	210.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	220.00

అర్జీలు పునరావృతం కాకుండా సమస్యలను పరిష్కరించాలి

● ఎస్పీ తుషార్ డూడి



అర్జీలు స్వీకరించి సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ తుషార్ డూడి

బాపట్ల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): అర్జీలు పునరావృతం కాకుండా పోలీసు అధికారులు చర్యలు తీసుకొని శాశ్వత పరిష్కారం చూపాలని ఎస్పీ తుషార్‌డూడి తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 58మంది అర్జీల ందించి సమస్యలను ఎస్పీకి వివరించారు. కార్యక్రమంలో సీసీఎస్ డీఎస్పీ పి.జగదీష్‌నాయక్, పీజీఆర్ఎస్ సెల్ సీఐ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి చెక్కులు అందజేత

బాపట్ల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణ, మండలం, గ్రామాలలో అధిక సంతానం వల్ల ఆర్థికంగా ఇబ్బందిపడుతున్న కుటుంబాల వారికి కుటుంబ నియంత్రణపై కలెక్టర్ జె.వెంకటమురళి అవగాహన కల్పించారు. ఆడవారికి, మగవారికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకునేందుకు ప్రోత్సహించి ఆపరేషన్‌లు చేసిన వారికి ప్రోత్సాహక నగదు చెక్కులను కలెక్టర్ సోమవారం పంపిణీ చేశారు. ఆపరేషన్‌లు చేసిన డాక్టర్‌లు, ఏఎన్ఎంలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ, ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ జి.గంగాధర్‌గౌడ్, ఆర్డీవో పి.గ్లోరియా, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు చెక్కులను అందజేస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి

శ్రీలింగోద్భవ దేవస్థానం నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం

పిట్టలవానిపాలెం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చందోలులోని శ్రీలింగోద్భవస్వామివారి దేవస్థానానికి 9 మంది సభ్యులతో ధర్మకర్తల మండలి సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. బాపట్ల దేవదాయశాఖ డివిజన్ ఇన్‌స్పెక్టర్ ఎం.గోపి నూతన పాలకమండలి సభ్యులతో ఈ ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన ఛైర్మన్‌గా పరిమిరామకృష్ణసాయిబాబు, సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. అలాగే మండలంలోని చందోలులోని శ్రీచెన్నకేశవస్వామివారి దేవస్థానంకు 9 మంది నూతన సభ్యులతో ధర్మకర్తల మండలి సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. బాపట్ల డివిజన్ దేవధాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఎం.గోపి ఆధ్వర్యంలో నూతన పాలకమండలి సభ్యుల ప్రమాణ స్వీకారం నిర్వహించారు. పాలకమండలి సభ్యులుగా ఎండూరి లీలా నాగేంద్ర సాయి వెంకట కోటేశ్వరగుప్తా, సభ్యులుగా కల్లూరి హరికుమారి, అద్దెపల్లి ప్రభావతి, కత్తిన నాగరాణి, గ్రంధి శ్రీనివాసరావు, ఇంటూరి నారాయణస్వామి, కర్రి వెంకట వరప్రసాద్, పోతర్లంక హేమలత, బాడుగుల మాధవరావు, ఎక్స్ అఫిసియల్ సభ్యులుగా వేదాంతం కృష్ణమాచార్యులు ప్రమాణస్వీకారం చేశారు.

స్మార్ట్ రోబోటిక్స్‌పై అవగాహన



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శ్రీనివాసరావు తదితరులు

బాపట్ల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): బాపట్ల మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతున్న ఈసీఈ విద్యార్థినులకు స్మార్ట్ రోబోటిక్స్‌పై వర్క్‌షాపు నిర్వహించారు. సోమవారం ప్రారంభమైన ఈ వర్క్‌షాపు ఈ నెల 30వ తేదీ వరకు జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శ్రీనివాసరావు తెలిపారు. ఎస్ఆర్‌సీఈ సొల్యూషన్స్ విజయవాడ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఐ.హరిత, ఈసీఈ విభాగాధిపతి బి.మహాలక్ష్మి, సత్యకుమార్, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

బీఈసీలో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు

బాపట్ల రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో టీమ్ సీసీఏ, ఎన్ఎస్ఎస్ యూనిట్స్ ఆధ్వర్యంలో మట్టి వినాయకుని తయారీ పోటీలు, మొక్కలు నాటే కార్యక్రమాన్ని సోమవారం బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించారు. కార్యక్రమానికి బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యాన్ని కొనసాగించాలన్నారు. సెక్రటరీ మానం నాగేశ్వరరావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.రమాదేవి, కళాశాల డీన్ స్టూడెంట్ ఎఫైర్స్ ప్రొఫెసర్ డి.నిరంజన్‌బాబు, అధ్యాపకులు డాక్టర్ కె.రాజేంద్ర, గణపతిప్రసాద్, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

మెరుగైన సాంకేతికతతో స్వామిత్వ సర్వే

భట్టిప్రోలు (కొల్లూరు), ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మెరుగైన సాంకేతికతతో స్వామిత్వ సర్వే నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎస్.వెంకటరమణ పేర్కొన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, సామాజిక, ఆర్థిక సాధికారత, స్వీయ సాధికారతను ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం స్వమిత్వ సర్వే పథకాన్ని ప్రారంభించిందన్నారు. మండల గ్రామాల్లో ఇళ్ల ఇంటి స్థలాలు సర్వేచేసి ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయడం జరుగుతుందన్నారు. మ్యాపింగ్‌ల ప్రకారం ఓలేరులో సర్వే ప్రారంభించినట్లు తెలిపారు. సచివాలయ సిబ్బంది, సర్వేయర్లు, స్వమిత్వ సర్వే నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

నగరంలో వర్క్ ఫ్రమ్ హోం

నగరం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతీ, యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని నగరం ఎంపీడీవో బి.శ్రీనివాసరావు అన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా శిక్షణ ఏర్పాటు చేస్తుందన్నారు. దీనికి సంబంధించి తమ విద్యా అర్హత, ఆధార్‌లింక్ అయిన మొబైల్‌తో సచివాలయంలో సంప్రదించాలన్నారు. 3122మందికి వర్క్ ఫ్రం హోం అవకాశముండగా ప్రస్తుతానికి 2321 మాత్రమే నమోదు చేసుకున్నారని ఇంకా 800 మందికి అవకాశం ఉందన్నారు.

దివ్యాంగుల పింఛన్లు తిరిగి మంజూరు చేయాలి

బాపట్ల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): తొలగించిన దివ్యాంగుల పింఛన్లను తిరిగి మంజూరు చేయాలని మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి డిమాండ్ చేశారు. ఈ విషయమై సోమవారం కలెక్టరేట్ వద్ద దివ్యాంగులు, వైసీపీ నాయకులతో కలిసి ఆందోళన చేశారు. అనంతరం కలెక్టర్ జె.వెంకట మురళికి వినతి పత్రం అందజేశారు. అర్హత గల ప్రతిఒక్కరికి పింఛన్లు ఇవ్వాలన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. వైసీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు చల్లా రామయ్య, పట్టణ, మండల పార్టీ అధ్యక్షుడు కాగిత సుధీర్‌బాబు పాల్గొన్నారు.

రజకులకు సామాజిక రక్షణ చట్టం చేయాలి

బాపట్ల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రజకులకు సామాజిక రక్షణ చట్టం చేయాలని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం సంఘనాయకులు ధర్నా చేశారు. జిల్లా కార్యదర్శి వి.కొండయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రజకుల సంక్షేమానికి బడ్జెట్‌లో రూ.1000 కోట్లు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వరమ్మ, వీరబాబు, బ్రహ్మయ్య, సాంబయ్య, వెంకట్రావు, మాధవరావు, చందు, ఉదయ్‌గిరి సురేష్ పాల్గొన్నారు.

స్కూల్ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

బాపట్ల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): టీవీఎస్ మోటారు సైకిల్‌పై వెళుతున్న ఓ వ్యక్తిని వెనుక నుంచి వచ్చిన ప్రైవేట్ స్కూల్ బస్సు ఢీకొట్టటంతో ఆ వ్యక్తి అక్కడికక్కడే రోడ్డుపైపడి మృతి చెందాడు. పట్టణ సీఐ ఆర్.రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని డ్రైవర్స్ కాలనీకి చెందిన మరుప్రోలు ఏడుకొండలు రెడ్డి టీవీఎస్ మోటారు సైకిల్‌పై గడియార స్తంభం వైపు నుంచి పాతబస్టాండ్ వైపు వెళుతుండగా పాత బస్టాండ్ దగ్గర వెనుకగా వస్తున్న స్కూల్ బస్సు వేగంగా ఢీకొట్టింది. దీంతో మోటారు సైకిల్‌పై ఉన్న ఏడుకొండలురెడ్డి రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి బాధ్యతతో పని చేయాలి

● కలెక్టర్ జె.వెంకటమురళి



కలెక్టర్ జె.వెంకటమురళికి సమస్య వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి, దివ్యాంగుల నాయకులు

బాపట్ల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతతో పనిచేయాలని కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 190మంది అర్జీల ద్వారా తమ సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. అర్జీలు స్వీకరించి కొన్నిటికి తక్షణమే పరిష్కారమార్గం చూపించారు. ప్రభుత్వ భూములను ఆక్రమించి కట్టడాలను నిర్మించిన వాటిని కూల్చివేయాలని, కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని బాపట్ల డీఎల్‌డీవోకు కలెక్టర్ సూచించారు. పత్రికలలో వచ్చే ప్రతికూల వార్తలపై కలెక్టర్ స్పందించి ఆయా శాఖల అధికారులను ప్రశ్నించారు. స్వామిత్వ సర్వే పురోగతిపై ఎంపీడీవోలతో సమీక్షించారు. రైతులకు ఎరువుల కొరత లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయాధికారులను ఆదేశించారు. సమావేశంలో ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ జి.గంగాధర్‌గౌడ్, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, ఆర్డీవో పి.గ్లోరియా, అన్ని శాఖల జిల్లా అధికారులు, డీఎల్‌డీవోలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఏడు అర్జీలు

రేపల్లె, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కార వేదికకు ఏడు అర్జీలు అందాయని ఆర్డీవో రామలక్ష్మి తెలిపారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణాభివృద్ధి సంఘం కార్యదర్శి సీవీమోహన్‌రావు నూతన జిల్లాల ఏర్పాటు ప్రతిపాదన జరుగుతున్నందున రేపల్లె డివిజనల్ కార్యాలయాన్ని తెనాలి డివిజన్‌లో విలీనం చేయాలని కోరారు.



ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలను పరిశీలిస్తున్న ఆర్డీవో రామలక్ష్మి

తీరప్రాంత భద్రతపై అవగాహన సదస్సు

బాపట్ల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామ్‌నగర్ రామాలయం వద్ద సోమవారం తీరప్రాంత భద్రత, అప్రమత్తత, సహకారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. మెరైన్ సీఐ లక్ష్మారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఈగల్ టీమ్, మత్స్యశాఖ, అటవీశాఖ, మండల పరిషత్ కార్యాలయ సిబ్బందితోపాటు మత్స్యకార సొసైటీ నాయకులు పాల్గొన్నారు. అనుమానాస్పద పడవలు, అత్యవసర సంఘటనలపై వెంటనే 1093, 1554 నెంబర్లకు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలన్నారు. పడవల రిజిస్ట్రేషన్ తప్పనిసరని చెప్పారు. ఉగ్రవాదులు, స్మగ్లింగ్ వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలు అరికట్టటంలో పోలీసులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో దుర్గాప్రసాద్, బ్లెస్సీ, శ్రీనివాసరావు, వర్మ, ఏడుకొండలు పాల్గొన్నారు.

బాపట్లలో బీపీ మండల్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

బాపట్ల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): బాపట్లలో బీపీ మండల్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని సమాజ్‌వాదీ పార్టీ జిల్లా అధ్యక్షుడు మేదా శ్రీనివాసరావు కోరారు. స్థానిక సమాజ్‌వాదీ పార్టీ కార్యాలయంలో సోమవారం బిందేశ్వర ప్రసాద్ మండల్ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓబీసీ రిజర్వేషన్‌ల పితామహుడు బీపీమండల్ విగ్రహాన్ని బాపట్లలో ఏర్పాటు చేయటానికి అవసరమైన అనుమతినివ్వాలని కోరారు. సమావేశంలో నాయకులు మోర్ల చిన వెంకటేశ్వరరావు, కాండ్రు శరత్‌కుమార్, బోయిన సూరిబాబు, పణి తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయ సంఘ జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాసరావు

బాపట్ల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయ సంఘ బాపట్లజిల్లా సర్వసభ్య సమావేశం సోమవారం మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు పీవీ రమణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జి.సత్యం ఆధ్వర్యంలో నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా కేవీ శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా వీవీ కృష్ణారావు, ఆర్థిక కార్యదర్శిగా ఎస్.శ్రీనివాసరావు, రాష్ట్ర కౌన్సిలర్‌గా ఎం.వెంకటేశ్వర్లు, కె.నిరీక్షణరావు, పి.పేరిరెడ్డిలతో పాటు 21మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ పోస్టర్ ఆవిష్కరణ

బాపట్ల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 30, 31 తేదీలలో గుంటూరులోని శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరగనున్న ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ రాష్ట్ర కాన్ఫరెన్స్ వాల్‌పోస్టర్‌ను సోమవారం బాపట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కంచర్ల అవినాష్ బాపట్ల కోర్టు ప్రాంగణంలో ఆవిష్కరించారు. న్యాయవాదులంతా ఈ కాన్ఫరెన్స్‌కు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు బిళ్ళా కమల్‌కుమార్, దగ్గుమల్లి హనుమయ్య తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల వేతనాలు పెంచాలని వినతి

వేమూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న ధరలను దృష్టిలో పెట్టుకుని వాటికి అనుగుణంగా ప్రభుత్వం పంచాయతీ కార్మికుల వేతనాలను పెంచాలని సీఐటీయూ మండల కార్యదర్శి అగస్టీన్ కోరారు. సోమవారం వేమూరు, జంపని, చావలి గ్రామ పంచాయితీల కార్మికుల సమావేశాలు నిర్వహించారు. ఆయా పంచాయితీల కార్యదర్శులకు కార్మికులు తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాలను సమర్పించారు. కార్యక్రమంలో రవికుమార్, రాంబాబు, మరియమ్మ, కిరణ్, ప్రసన్నకుమారి, హనోకు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీలక్ష్మీగణపతి పరివార దేవతల ప్రతిష్ఠ

చెరుకుపల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): చెరుకుపల్లి మండలం పొన్నపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని దుండిపాలెంలో లక్ష్మీగణపతి శ్రీదేవి అమ్మవారు సీతారామలక్ష్మణ ఆంజనేయస్వామి వార్ల ప్రతిష్ఠా మహోత్సవం శ్రీస్వర్ణ శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా జరిగింది. అధికసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు. కార్యక్రమంలో పొన్నపల్లి సత్యనారాయణ, దుండి వెంకటరామిరెడ్డి, ఏడుకొండలరెడ్డి, పిట్టు శ్రీనివాసరెడ్డి, వారే మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన పరీక్షా విధానాన్ని రద్దు చేయాలి

● ఏపీ ఉపాధ్యాయ సంఘం బాపట్ల జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసకుమార్

వేమూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో ఈ సంవత్సరం ప్రవేశపెట్టిన కొత్త పరీక్ష విధానాన్ని రద్దు చేయాలని ఏపీ ఉపాధ్యాయ సంఘం బాపట్ల జిల్లా అధ్యక్షులు శ్రీనివాసకుమార్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, కొత్తగా ప్రవేశ పెట్టిన పరీక్షా విధానం చాలా ఇబ్బందికరంగా ఉందన్నారు. పూర్వ పద్ధతిలోనే పరీక్షలు నిర్వహించి విద్యార్థులకు సక్రమంగా పరీక్ష రాసే అవకాశాన్ని కల్పించాలని ఉపాధ్యాయులకు తగిన సమయాన్ని ఇవ్వాలని కోరారు.

గల్లంతైన యువకుడి మృతి

కొల్లూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు చెరువులో దిగిన యవకుడు గల్లంతై మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ జానకీ అమరవర్ధన్ వివరాల మేరకు.. కొల్లూరు బోసునగర్‌కు చెందిన సబావత్ గోపీనాయక్ (34) అనే యువకుడు కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రాత్రి పెద్దమ్మ ఇంటికి వెళ్లి వస్తూ సమీపంలోని చెరువులో దిగి గల్లంతయ్యాడు. ఇది గమనించిన ఓ మహిళ 100కు డయల్ చేయడంతో ఎస్ఐ ఘటనా స్థలానికి చేరుకున్నారు. గజ ఈతగాళ్లను పిలిపించి మృతదేహాన్ని వెలికితీయించారు.

ఖాజీపాలెంలో ఫాగింగ్

పిట్టలవానిపాలెం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖాజీపాలెం గ్రామపంచాయతీలో డెంగీ, విషజ్వరాలు ప్రబలకుండా ముందస్తు చర్యలలో భాగంగా ఫాగింగ్ నిర్వహించారు. ఖాజీపాలెం గ్రామ సర్పంచ్ కుంటం అనూష ప్రసన్న ఆధ్వర్యంలో గ్రామంలో కార్యదర్శి దాసరి వెంకటశివకుమారితో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత పిట్టలవానిపాలెం ఇన్‌చార్జి ఎంపీడీవో ఎ.ఏలీషాబాబు, చందోలు ప్రాథమిక వైద్యశాల వైద్యసిబ్బందితో కలిసి ఆప్రాంతాన్ని పరిశీలించారు.

ఎరువుల దుకాణాలో విజిలెన్స్ అధికారుల తనిఖీలు

● మూడు దుకాణాలపై కేసులు నమోదు

బాపట్ల, నగరం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఎరువుల దుకాణాలపై సోమవారం విస్తృత దాడులు చేశారు. విజిలెన్స్ డీజీ హరీష్ గుప్తా ఆదేశాల మేరకు గుంటూరు రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి డి.సూర్యశ్రావణకుమార పర్యవేక్షణలో దాడులు నిర్వహించారు. జిల్లాలోని కర్లపాలెం, నగరం, భట్టిప్రోలు మండలాలలో నిర్వహించిన దాడుల్లో వ్యవసాయాధికారులతో కలిసి స్టాక్‌ను పరిశీలించారు. నగరం మండలం సజ్జావారిపాలెంలో కైలాష్ ఫర్టిలైజర్స్ షాపునందు ఎరువుల నిల్వలలో వ్యత్యాసం ఉన్నందున 4.3మెట్రిక్ టన్నుల ఎరువులను స్వాధీనం చేసుకొని 6ఎ కింద కేసు నమోదు చేశారు. వీటి విలువ 1,11,800 రూపాయలు ఉంది. ఆదేవిధంగా భట్టిప్రోలు మండలంలోని సోమశేఖర్ ఫర్టిలైజర్స్‌లో అనుమతులు లేని 133బస్తాల ఎరువులకు స్టాప్‌సేల్ నోటీసులిచ్చారు. వీటి విలువ 35,557 రూపాయిలు ఉంటుంది. కర్లపాలెం మండల కేంద్రంలోని పవన్ ట్రేడర్స్‌లో 0ఫారమ్స్ లేకుండా డీఏపీ అమ్ముతున్నట్లు గుర్తించి 18.8మెట్రిక్‌టన్నుల డిఏపికి స్టాప్‌సేల్ నోటీసులు ఇచ్చారు. వీటివిలువ రూ.5,07,600 ఉంటుంది. తనిఖీలు నిర్వహించిన వారిలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ కె.చంద్రశేఖర్, వ్యవసాయాధికారి సి.హెచ్.ఆదినారాయణ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



ఎరువుల దుకాణాలలో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

● కొల్లూరు : ఎరువులను అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు దుకాణదారులను హెచ్చరించారు. సోమవారం కొల్లూరు మండలంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను పరిశీలించారు. తనిఖీల్లో వీఆర్వో, పోలీసు శాఖ సిబ్బంది, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

● అమృతలూరు: అమృతలూరులోని ఒక రైతుకు చెందిన చావిడిలో యూరియా నిల్వలను అధికారులు సోమవారం గుర్తించారు. తహసీల్దార్ కె నెహ్రూబాబు, మండల వ్యవసాయశాఖ అధికారి హేమంత్‌భరత్‌కుమార్, పోలీసు సిబ్బందితో కలసి యూరియా నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. 32 బస్తాల యూరియాతో పాటు 14-35-14 6బస్తాలు నిల్వలను గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వీటిపై విచారణ జరపనున్నట్లు చెప్పారు.

● పిట్టలవానిపాలెం: మండలంలోని పిట్టువారిపాలెం రొయ్యల కంపెనీలో, చందోలు సాయి జిష్ణు దుకాణాలను సోమవారం పిట్టలవానిపాలెం మండల తహసీల్దార్ డి.వెంకటేశ్వరరావు, మండల వ్యవసాయశాఖాధికారి సి.హెచ్.సత్యానంద్, ఆర్ఐ కె.శ్రీనివాసరావు, చందోలు పోలీసుసిబ్బంది, వీఆర్వో అరుణ ప్రసన్న పరిశీలించారు.

బాల్య వివాహాలు చేయటం నేరం

బాపట్ల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని ప్యానల్ లాయర్ దగ్గుమల్లి కిరణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని వెస్ట్‌బాపట్ల రాజీవ్‌గాంధీనగర్‌లో సోమవారం మండల న్యాయ సేవాధికార కమిటీ ఆధ్వర్యంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో పారా లీగల్ వలంటీర్ నల్లమోతు శామ్యూల్‌జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయకుడి ప్రతిమల పంపిణీ



మట్టి వినాయకుడి విగ్రహాలు పంపిణీ చేస్తున్న అనగాని శివప్రసాద్

రేపల్లె, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషిచేయాలని మట్టి వినాయకుడిని పూజించి పర్యావరణాన్ని కాపాడదామని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మంత్రి అనగాని సత్యప్రసాద్ సూచనలతో మట్టి వినాయకుడి ప్రతిమలను పంపిణీచేశారు. కార్యక్రమంలో కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ పంతానిమురళీధరరావు, టీడీపీ నాయకులు జీవీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నీట్‌లో సీటు సాధించిన విద్యార్థినికి సత్కారం

రేపల్లె, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): నగరం మండలం బెల్లంవారిపాలెం గ్రామానికి చెందిన విద్యార్థిని సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో విద్యను అభ్యసించిన పమిడిపాములంకరుణశ్రీ ఈ ఏడాది నీట్‌లో సీటుసాధించింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతులమీదగా మెమోంటో రూ.లక్షలు చెక్కును అందుకుంది. ఈ సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం విద్యార్థినిని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అభినందించారు. కార్యక్రమంలో కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పంతాని మురళీధరరావు, లుక్కా గుడారంకయ్య, ఆలూరి భిక్షాలు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పందుల పెంపకందారులకు నోటీసులు అందజేత

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అమృతలూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో పందు లు స్వైరవిహారంపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పందుల పెంపకందారులు వారి ఇళ్ళకు వెళ్లి అధికారులు నోటీసులు జారీ చేశారు. పందులను గ్రామంలో బహిరంగ ప్రదేశాలు, పంట పొలాల్లో తిరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో జొన్నలగడ్డ వినయ్‌బాబు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి సాంబశివరావు, బిల్ కలెక్టర్, రిజ్వాన్‌బాబు పందుల పెంకందారులకు నోటీసులు జారీచేసిన వారిలో ఉన్నారు.



సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందజేత

చుండూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మండలంలో అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న ఏడుగురికి వైద్య చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి అందిన రూ.4.17 లక్షల చెక్కులను గుంటూరు క్యాంపు కార్యాలయంలో సోమవారం బాధితులకు అందజేశారు. వలివేరుకు చెందిన పట్టెంశెట్టి లోకేంద్ర రూ.1,01,861, వలివేటి శాంతకుమారి రూ.41 వేలు, షేక్ మొహిద్దీన్ భాషా రూ.40 వేలు, పచారి శ్రీనివాసరావు రూ.25 వేలు, యడ్లపల్లికి చెందిన మునునూరు శివరామప్రసాద్ రూ.1.18 లక్షలు, గోగినేని దీప్‌చంద్ రూ.21 వేలు చెక్కులు రూపంలో అందించారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు తమ్మా శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీ కాలనీలో నిలిచిన నీరు తొలగింపు

● దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



బీసీ కాలనీలో నిలిచిన నీటిని మోటార్ల ద్వారా తరలిస్తున్న పంచాయతీ అధికారులు

రేపల్లె, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఇళ్ళ మధ్య నీటితో రోగాల భయం అంటూ ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. సోమవారం మండలంలోని పెనుమూడి బీసీ కాలనీలో గృహాల మధ్యన నిల్వ ఉన్న నీటిని పంచాయతీ సెక్రటరీ అబ్దుల్‌హుస్సేన్ మోటార్ల ద్వారా నీటిని బయటకు తోడించారు. ఆరోగ్య సిబ్బంది దోమల నివారణ కోసం లార్వా ఉండలను మురుగు నీటిలో చల్లారు.

ఎమ్మార్పీ ధరలకే మద్యం అమ్మాలి

● ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయ

రేపల్లె, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మద్యం బార్‌అండ్‌రెస్టారెంట్‌లో ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీ ధరలకే మద్యం అమ్మకాలు జరపాలని ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయ అన్నారు. సోమవారం ఎక్సైజ్ కార్యాలయంలో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన బార్ పాలసీ, రెస్టారెంట్ బార్‌ల నిర్వహణకు సంబంధించిన నోటిఫికేషన్ అనుసరించి స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఏ4 షాపు నిర్వహకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన నిబంధనల ప్రకారమే బార్ అండ్ రెస్టారెంట్‌లు నిర్వహించాలన్నారు. బార్ అండ్ రెస్టారెంట్‌లు లాటరీ పద్ధతిలో ఎంపిక ఉంటుందన్నారు. ఆసక్తి గలవారు బార్‌అండ్ రెస్టారెంట్‌ల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నిరుపేదలకు ఆర్థిక చేయూత

కర్లపాలెం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదలకు శ్రీ ఛత్రపతి శివాజీ మహరాజ్ ఫౌండేషన్ ద్వారా ఆర్థిక చేయూతనందిస్తున్నామని ఫౌండేషన్ అధ్యక్షుడు శివాజీరాజు అన్నారు. శ్రీ చత్రపతి శివాజి మహరాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఒక పేద కుటుంబానికి 10 కిలోల బియ్యం ఫౌండేషన్ అధ్యక్షుడు శివాజీరాజు, తూనుగుంట్ల రామ్మోహనరావు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెనుమెత్స చిన్న, పెనుమెత్స దేవేందర్‌రాజు, తిరువీధుల రవికుమార్, వానపాల శ్రీనివాసరాజు, నరేష్, నక్కా రమేష్ పాల్గొన్నారు.

గీత కార్మికులకు బార్ లైసెన్సు ఫీజులో 50 శాతం రాయితీ

● డిప్యూటీ కమిషనర్ కె.హేమంత నాగరాజు

బాపట్ల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కల్లు గీత కార్మికులకు బార్ లైసెన్స్ ఫీజులో 50శాతం రాయితీ ఇస్తున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ కె.హేమంత నాగరాజు తెలిపారు. బాపట్ల ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో సోమవారం బార్ షాపుల నిర్వాహకులు, వైన్‌షాపుల యజమానులతో ఆయన సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ బార్ లైసెన్స్ పొందినవారు లైసెన్స్ ఫీజు ఆరు విడతలలో చెల్లించే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. కొత్తపాలసీ ప్రకారం రూ.5 లక్షల చొప్పున చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. సమావేశంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జిల్లా అధికారి బి.వెంకటేశ్వర్లు, సీఐ పి.గీతిక, ఎస్ఐలు డి.ప్రభుదాసు, ఎస్.మౌనిక పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందనలు



ఎన్.గాయత్రి

నగరం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థినిని నగరం ఎస్వీఆర్‌ఎం కళాశాల కరస్పాండెంట్ సెక్రటరీ వల్లభనేని బుచ్చయ్యచౌదరి అభినందించారు. సోమవారం బుచ్చయ్య చౌదరి విలేరులతో మాట్లాడుతూ క్రమశిక్షణ, ఉత్తమ విద్యావిధానం తోనే విద్యార్థులు రాణిస్తున్నారని అన్నారు. ఈ నెల 21వ తేదీ నుంచి 23వ తేదీ వరకు జమ్మూ, కాశ్మీర్‌లో నిర్వహించిన ఖేలో ఇండియా (వాటర్ ఫెస్టివల్) జాతీయ స్థాయిలో స్థానిక వెలగపూడి రామకృష్ణ స్మారక కళాశాల నగరం విద్యార్థిని, ఎన్.గాయత్రి తృతీయ (బీసీఏ) కయాకింగ్ కానోయింగ్ (వాటర్‌రేస్)లో అద్వితీయ ప్రతిభ కనపరచి ద్వితీయస్థానం సాధించిందన్నారు. ఈ సందర్భంగా నాగిడి గాయత్రికి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల పిన్సిపాల్ డాక్టర్ అనగాని హరికృష్ణ, కళాశాల సూపరిడెంట్ పి.అమరేశ్వరరెడ్డి, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ వి.సాంబమూర్తి, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు అభినందనలు తెలిపారు.



రూ. 15 వేలు దాటిన మిర్చి ధర

● మరింత పెరిగే అవకాశాలు

గుంటూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మిర్చి ధర క్రమంగా పెరు గుతోన్నది. కొత్త పంట మార్కెట్‌కు రావడానికి మరికొన్ని నెలల సమయం పట్టే అవకాశం ఉండటంతో ధర పెరుగుతున్నట్లు వ్యాపా రులు విశ్లేషిస్తున్నారు. మే నెలకు ముందు వరకు క్వింటాల్ రూ. 10 వేల నుంచి రూ. 13 వేల మధ్యనే ఉన్న మేలి మి రకాల మిరపకా యలు నేడు క్వింటాల్‌కు రూ. 2 వేలకు పైగా పెరిగాయి. సోమవారం గుంటూరు వ్యవ సాయ మార్కెట్ కమిటీలో మిర్చికి క్వింటాల్ ధర రూ. 15,200 వరకు లభించింది. రోజుకు 50 వేల టిక్కీల వరకు అమ్మకాలకు డిమాండ్ ఉండటంతో మరికొద్ది రోజుల్లో ధర మరింత పెరగొచ్చని అంచనా వేస్తున్నారు. దేశ వ్యాప్తంగా మిర్చి మార్కెట్‌లో నెలకొన్న పరిస్థితులు కారణంగా ట్రేడర్లు గుంటూరు మిర్చి మార్కెట్ వైపు చూస్తున్నారు. ఒకవైపు చైనాకు ఎగుమతులు, మరోవైపు ఈశాన్య రాష్ట్రాలు, బంగ్లాదేశ్‌కు క్రమం తప్ప కుండా మిర్చి లోడ్‌లు వెళుతుండటంతో డిమాండ్ స్థిరం గా కొనసాగుతున్నది. గతంలో మిర్చి లారీల సంఘం సిండికేట్ కా రణంగా ఒక లోడింగ్ చేయాలంటే రూ. 40 వేలు అదనంగా ఖర్చు అ య్యేది. సీఎం ఆదేశాలతో ఇప్పుడు అది లేకపోవడంతో వ్యాపారస్థులు కూడా పోటీ పడి ధర పెంచుతున్నారు. దీంతో మార్కెట్ ఈ వారం ప్రారంభ రోజునే ఆశాజనకంగా ముగిసింది. నంబరు. 341కి రూ. 15 వేలు, తేజకి రూ. 15 వేలు, ఏసీ వెరైటీ 341కి రూ. 15,200 ధర లభిం చడంతో రైతులు, స్టాకిస్టులు సంతోషాన్ని వ్యక్తపరుస్తున్నారు.

మైము నృత్యం ఒక అందమైన కళ

అంతర్జాతీయ కళాకారుడు మధు

ఏఎన్‌యూ, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): సంభాషణ లేకుండా చేసే మైము నృత్యం ఒక అందమైన కళ అని అంతర్జాతీయ నటుడు డాక్టర్ మధు అన్నారు. ఏఎన్‌యూ రంగస్థలం కళాశాల శాఖ ఆధ్వర్యంలో సోమవారం మూకాభినయం (మైము) ప్రక్రియ మీద శిక్షణ శిబిరం ఏర్పాటు చేశారు. మైము విద్యలో అంతర్జాతీయ ఖ్యాతి గడించిన డాక్టర్ మధు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులకు ఈ మూకాభినయం ప్రాముఖ్యత, మెళకువలపై అవగాహన కల్పించారు. థియేటర్ ఆర్ట్స్ విభాగం ఆచార్య ఎల్‌వీ నాగభూషణరావు, నృత్య శాఖ అధ్యాపకుడు డాక్టర్ ఎం.కాశయ్య మూకాభినయ ఆవశ్యకతను తెలియజేశారు.



మైము గురించి విద్యార్థులకు తెలియజేస్తున్న అంతర్జాతీయ నటుడు మధు

గుంటూరులో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన శిల్పారామం జాతీయస్థాయి వస్త్ర వేదికగా మారింది. 2014 - 19కి మధ్య అప్పటి ప్రభుత్వం ప్రారంభించిన శిల్పారామం పోయిన ఐదేళ్లలో తీవ్ర నిరాదరణకు గురయింది. కూటమి ప్రభుత్వం రాకతో.. శిల్పారామం తిరిగి ప్రాణం పోసుకుంది. తాజాగా చేపట్టిన రాష్ట్రస్థాయి చేనేత మేళాతో జాతీయ స్థాయి వస్త్ర నిలయంగా నగర వాసులను ఆకట్టుకుంటోంది.

● రాష్ట్ర స్థాయి చేనేత ఉత్పత్తుల మేళా.. 'షీ'

● రాష్ట్రం నలుమూలల నుంచి భారీగా చేనేత ఉత్పత్తులు

● యూపీ, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, కశ్మీర్, తమిళనాడు నుంచి స్టాల్స్



శిల్పారామంలో ఏర్పాటు చేసిన స్టాల్స్

● సెప్టెంబరు 2 వరకు ప్రదర్శన, అమ్మకాలు

శిల్పారామం.. కళా శోభితం

గుంటూరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వ జౌళీ మంత్రిత్వ శాఖ సౌజన్యంతో ఆంధ్రప్రదేశ్ శిల్పారామం ఆర్ట్స్, క్రాఫ్ట్స్ అండ్ కల్చరల్ సొసైటీ రాష్ట్రస్థాయి వస్త్ర ప్రదర్శనను గుంటూరులోని శిల్పారామంలో నిర్వహిస్తోంది. నగరంలోని ఆర్టీవో కార్యాలయం దగ్గర ఉన్న శిల్పారామంలో స్టేట్ హ్యాండ్లూమ్ ఎగ్జిబిషన్ (షీ)- 2025 పేరుతో ఈ నెల 20న చేనేత మేళాను ప్రారంభించారు. ప్రతి రోజూ ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకు జరుగుతున్న ఈ వస్త్ర ప్రదర్శనశాలకు మంచి స్పందన లభిస్తోంది. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు ఇక్కడ నిర్వహిస్తున్నారు. గుంటూరు నగరం సహా చుట్టుపక్కల ప్రాంతాల నుంచి చేనేత వస్త్ర అభిమానులు వస్తున్నారు. చేనేత ఉత్పత్తులను తీసుకుంటున్నారు.

అందుబాటులో అనేక రాష్ట్రాల చేనేత వస్త్రాలు


చేనేత వస్త్ర ప్రదర్శనలో మంగళగిరి, వెంకటగిరి జరీ, చీరాల, మచిలీపట్నం, కడప, నారాయణపేట, ఉప్పాడ, ధర్మవరం, పోచంపల్లి, కుప్పడం శిల్క్స్, పొందూరు ఖాదీ, కడప కాటన్ ప్రింటెడ్ టవల్స్, లుంగీలు వంటి తెలుగు సంప్రదాయ చేనేత, పట్టు ఉత్పత్తులకు సంబంధించి పెద్ద సంఖ్యలో స్టాళ్లు ఏర్పాటు చేశారు. వీటితోపాటు కశ్మీరి శిల్క్, ఉత్తరప్రదేశ్ బెడ్‌షీట్స్, కాటన్ బెడ్ షీట్స్, దర్రీస్, భాగల్‌పూర్ ఛాదర్, శిల్క్ షర్టింగ్, మధురై చీరలు, శంబల్‌పరి ఇక్కత్ వంటి ఎన్నో రకాలు వస్త్రాలు అందుబాటులో ఉన్నాయి.





అటో ఇటో అయితే.. జీవితాలు ఎటో!

వరద ఉధృతిలోనూ తగ్గేదే లేదు! పడవలపై గాజుల్లంక - శ్రీకాకుళం రాకపోకలు



అరవింద వారధి వద్ద కొనసాగుతున్న వరద ప్రవాహం

కొల్లూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా నదిలో వరద ఉధృతి కొనసాగుతోంది. అయినా గాజుల్లంక - శ్రీకాకుళం పడవలపై ప్రయాణికుల రాకపోకలు కొనసాగుతున్నాయి. కొల్లూరు మండలం గాజుల్లంక వద్ద కృష్ణా నదిలో ప్రయాణికులు కృష్ణా జిల్లా శ్రీకాకుళానికి రాకపోకలు సాగిస్తుంటారు. పడవలపై ద్విచక్ర వాహనాలు కూడా అటు వైపు తీసుకెళ్తుంటారు. ఇటీవల కృష్ణా నదికి వరద పోటెత్తడంతో కొద్ది రోజులు పడవ ప్రయాణాన్ని నిలిపివేశారు. నదిలో కొంత వరద ప్రవాహం తగ్గిందని భావించిన పడవల నిర్వాహకులు ప్రయాణికులను, వాహనాలను నది దాటిస్తున్నారు. కానీ, పడవల్లో కనీస భద్రతా ప్రమాణాలు పాటించడం లేదు. కనీసం లైఫ్ జాకెట్‌లు కూడా అందుబాటులో లేవు. ఆదివారం కృష్ణా నదిలో వరద ఉధృతి 3.90 లక్షల క్యూసెక్కులు కాగా.. సోమవారం ఉదయం 3,24,600 క్యూసెక్కులుగా ఉంది. దీనిపై తహసీల్దార్ బి. వెంకటేశ్వర్లును వివరణ కోరగా.. వరద ప్రవాహంలో పడవల రాకపోకలను నిషేధిస్తామన్నారు. పోలీసు, మత్స్యశాఖల అధికారులకు కూడా సూచిస్తామన్నారు.



గాజుల్లంక వద్ద వరద ఉధృతిలో శ్రీకాకుళం వెళ్లేందుకు పడవ ఎక్కుతున్న ప్రయాణికులు

30, 31 తేదీల్లో ఐఎల్‌ఏ రాష్ట్ర సదస్సు

● రాష్ట్ర అధ్యక్షుడు శాంతకుమార్

గుంటూరు(లీగల్), ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి):స్థానిక వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ రాష్ట్రస్థాయి సదస్సు ఈ నెల 30, 31 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జీ శాంతకుమార్ పేర్కొన్నారు. స్థానిక అరండల్‌పేటలోని ఐఎల్‌ఏ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం సదస్సు ఆహ్వాన గోడ ప్రతులను ఆవిష్కరించి, వివరాలను వెల్లడించారు. న్యాయవాదులకు ఉచిత బీమా కార్డులు, జూనియర్ న్యాయవాదులకు ఐదేళ్ల పాటు నెలకు రూ.10 వేల స్థయిఫండ్, ఇళ్ల స్థలాలు, మరణించిన న్యాయవాదులకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.4 లక్షల మ్యాచింగ్ గ్రాంట్, డెత్ బెనిఫిట్ రూ.10 లక్షలకు పెంచేందుకు రాష్ట్ర బార్ కౌన్సిల్ ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడం.. తదితర అంశాలపై రెండు రోజుల సదస్సులో చర్చిస్తామన్నారు. ముఖ్య అతిథిగా మధ్యప్రదేశ్ హైకోర్టు విశ్రాంత చీఫ్ జస్టిస్ సురేష్ కుమార్ కైట్, గౌరవ అతిథులుగా ఏపీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తులు జస్టిస్ కేసీ భాను, జస్టిస్ జి.శ్యాంప్రసాద్, డాక్టర్ ఎన్.జేసు రత్నకుమార్, జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ సెషన్ జడ్జి బి.సాయి కళ్యాణ్ చక్రవర్తి, పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ టీ తిరుమలన్, ఐఎల్‌ఏ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బి.కార్తీక్ నవ్యాన్, సీనియర్ న్యాయవాదులు రవివర్మ కుమార్, ఎ.సత్యప్రసాద్ ఇతర ప్రముఖులు పాల్గొని అనేక విషయాలపై చర్చిస్తారని చెప్పారు. ఐఎల్‌ఏ వ్యవస్థాపకులు శ్రీకాంత్, రాష్ట్ర నాయకులు నరసింహుడు, జిల్లా అధ్యక్షురాలు గీతవాణి, నగర అధ్యక్షుడు కాలేషా బేగ్, న్యాయవాదులు బండారు సాయిబాబు, ఆనంద్ పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ సభ్యులు

ఇదేం పంచాయితీ!

(5వ పేజీ తరువాయి)

ఆదేశించింది.

ప్రభుత్వం చెప్పింది కేవలం 5 శాతమే..

స్వర్ణ పంచాయతీ కార్యక్రమం ప్రవేశ పెట్టే సందర్భంగా పంచాయతీ కార్య దర్శులకు ప్రభుత్వం శిక్షణ తరగతులు ఏర్పాటు చేస్తే బాగుండేది అన్న భావన సర్వత్రా వ్యక్తమవుతోంది. కేవలం పుస్త కాలు ఇచ్చి వాటి ప్రకారం చేయాలని చెప్పడంతో.. కొందరు వాటిని వేరే రకం గా అర్థం చేసుకున్నారు. గతంలో ఉన్న జీవో ప్రకారం ఏటా పంచాయతీలు 5 శాతం పన్ను పెంచుకునే అవకాశం ఉం ది. ఆస్తి విలువను బట్టి వంద రూపా యలకు 12 పైసల నుంచి రూపాయి వరకు పన్ను విధించాలి. ఆస్తి విలువ సుమారు రూ. 2 లక్షలు ఉంటే రూ. 220 నుంచి రూ.250 వరకు ఇంటి పన్ను విధించాలి. దానికి అదనంగా లైబ్రరీ సెస్సు 8, ఫైర్ సెస్సు ఒక శాతం, క్రీడల సెస్సు 3, డ్రెయినేజీ సెస్సు, వీధి లైట్ల సెస్సు, నీటి సరఫరా సెస్సు విధించవచ్చు. అంతా కలిపినా రూ. 300 నుంచి రూ.350 వరకు ఇంటి పన్ను వస్తుంది. ప్రస్తుతం పన్ను పెంపునకు గతేడాది డిమాండ్‌ను పరిగణలోకి తీసుకు న్నారు. దాని మీద 5 శాతం పెంచుతున్నారు. స్వర్ణ పంచాయతీ పేరుతో కొందరు పంచాయతీ కార్యదర్శులు అందుకు భిన్నంగా పన్ను పెంచడంతో వందల్లో ఉన్న పన్ను రూ.వేలల్లోకి వెళ్లింది.

పెరుగుదలకు బ్రేకులు..

అసంబద్ధంగా ఇంటి పన్ను పెరిగిన చోట అసెస్మెంట్‌ల ఆన్‌లైన్ ప్రక్రియకు జిల్లా అధికారులు బ్రేకులు వేశారు. కొందరు పంచా యతీ కార్యదర్శులు జీవోను అతిక్రమించి పన్ను పెంచేశారని ఆరో పణలున్నాయి. 10 శాతం కూడా పెంచేశారని పలువురు అధికా రులు చెబుతున్నారు. అటువంటి చోట తిరిగి సమీక్ష నిర్వహించిన తర్వాత ఆన్‌లైన్ ప్రక్రియ కొనసాగుతుందని చెబుతున్నారు. ఆ ప్రక్రియ పూర్తయితేనే పెండింగ్‌లో ఉన్న ఇంటి పన్ను వసూలు చేసే అవకాశం లేదని కొందరు చెబుతున్నారు.

పట్టువదలని విక్రమార్కుడు.. జాన్ డేనియల్

● 17 ఏళ్లు, ఐదవ ప్రయత్నంలో ఉపాధ్యాయ ఉద్యోగం



జాన్ డేనియల్‌ను సత్కరిస్తున్న ఏఈఎల్‌సీ చర్చి యాజమాన్యం

క్రోసూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): క్రోసూరుకు చెందిన కంభంపాటి జాన్ డేనియల్ పట్టువదలని విక్రమార్కుడిలా సుమారు 17 సంవత్సరాల నుంచి ఉపాధ్యాయ ఉద్యోగం కోసం ప్రయత్నిస్తూనే ఉన్నాడు. మెగా డీఎస్సీలో ఎట్టకేలకు విజయం సాధించాడు. 2008 డీఎస్సీ నుంచి వరుసగా 2012, 2014, 2018లో డేనియల్ వరుస ప్రయత్నాలు చేశారు. బీసీ(సీ) క్యాటగిరికి చెందిన జాన్ ఒక మార్కు, రెండు మార్కులతో అవకాశాన్ని కోల్పోతూ వచ్చినా.. ఓర్పు, సహనాన్ని కోల్పోలేదు. హిందీ స్కూల్ అసిస్టెంట్, హిందీ టీజీటీ పోస్టులు రెండింటిలోనూ విజయం సాధించినట్లు తెలిపారు. ఆయనతో పాటు ప్రయత్నించి ఇప్పటికే ఉద్యోగం పొందిన ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. క్రోసూరులోని ఏఈఎల్‌సీ చర్చి యాజమాన్యం సోమవారం ఆయనను ఘనంగా సత్కరించింది. ఉద్యోగం సాధించిన మరొక అభ్యర్థి శామ్యూల్ మోరీస్‌ను కూడా సన్మానించారు. వీరి ఉద్యోగ జీవితం సంతోషంగా సమర్థంగా జరగాలని చర్చి ఫాస్టర్ మాచర్ల సుందరరావు ఆకాంక్షించారు.

తల్లిదండ్రుల ఆశా జ్యోతి



చదువుకుంటూ, కూలి పనులకెళ్తూనే డీఎస్సీ కొలువు

పెదకూరపాడు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో తొలి ప్రయత్నం లోనే ఉపాధ్యాయ కొలువు సాధించింది ఆశా జ్యోతి. ఈ సాధన వెనుక పెద్ద కష్టమే ఉంది. పెదకూరపాడు మండలంలోని జలాలపురం ఆమె స్వగ్రా మం. తల్లిదండ్రులు మన్నవ చిన్నప్ప, లూర్దుమేరి. ముగ్గురు కుమార్తెల సం తానంలో.. ప్రథమ కుమార్తె ఆశాజ్యోతి. సైన్స్ విభాగంలో రాసిన మూడు పేప ర్లలో స్కూల్ అసిస్టెంట్ బయాలజికల్ సైన్స్‌లో 12, టీజీటీ సైన్స్‌లో 15, టీజీటీ బయాలజికల్ సైన్స్‌లో 18వ ర్యాంకులు సాధించింది. తల్లిదండ్రులు కూలీ పనులు చేసుకుంటూ తమ ముగ్గురు కుమార్తెలను చదివిస్తున్నారు. గు రుకుల పాఠశాలలో విద్యనభ్యసించిన ఆశా జ్యోతి.. సెలవు రోజుల్లో కూలీ ప నులకు వెళ్తూ తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా నిలిచింది. తల్లిదండ్రుల ప్రోత్సాహం వల్లే తాను తొలి ప్రయత్నంలోనే ఉపాధ్యాయ కొలువు సాధించిన ట్లు ఆశా జ్యోతి ఆంధ్రజ్యోతికి తెలిపింది. ఆమె ఇద్దరు చెల్లెళ్లు ఒకరు ఇంజనీరింగ్, మరొకరు ఇంటర్ చదువుతున్నారు. కష్టపడి చదవడం వల్లే ఉపాధ్యా య కొలువుకు ఎంపికయ్యావని పలువురు ఆమెను అభినందిస్తున్నారు.

ఉపాధి కూలీనే..ఉపాధ్యాయుడు

తాడికొండ, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఉపాధి హమీ పథకంలో కూలి పని చేస్తూ.. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం పొందడం అందరికి ఆదర్శనీయమని గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వినుకొండ రాజారావు పేర్కొన్నారు. తాడికొండ గ్రామంలో ఉపాధి హమీ పథ కం కూలిగా పనిచేస్తూ.. డీఎస్సీలో 78.32 మార్కులు సాధించిన సూర్య ప్రకాష్‌ను సన్మానించారు. రాజారావు మాట్లాడుతూ అనారోగ్యంతో తండ్రి మరణించినా, వృద్ధాప్యంలో ఉన్న తల్లిని పోషించుకుంటూ డీఎస్సీ సెలక్షన్‌లో సూర్య ప్రకాష్ డీఎస్సీలో మంచి మార్కులు సాధించడం అభినందనీయమన్నారు.



సూర్య ప్రకాష్‌ను అభినందిస్తున్న గెజిటెడ్ అధికారులు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజారావు

ప్రభుత్వాసుపత్రుల్లో.. ఆన్‌లైన్ ఓపీ

● ముందుగా ఏరియా వైద్యశాలల్లో

● భవిష్యత్‌లో ప్రిస్కిప్షన్, ల్యాబ్ రిపోర్టులు ఆన్‌లైన్‌లో



ఏరియా వైద్యశాలకు వచ్చిన రోగులు



ఏరియా ఆస్పత్రి సత్తెనపల్లి

సత్తెనపల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలోని ఏరియా ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ఆన్‌లైన్ విధానం తీసుకు వస్తున్నారు. దీనికి సం బంధించి ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. భవిష్యత్‌లో కార్పొరేట్ స్థాయిలో ప్రిస్కిప్షన్, లేబ్ రిపోర్టు ఇతర వివరాలన్నీ ఆన్‌లైన్‌లో జారీ చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుంది. ఆన్‌లైన్ విధానం కోసం సెకండరీ హెల్త్ డైరెక్టరేట్ నుంచి ఏరియా వైద్యశాలకు కంప్యూటర్లు కూడా కేటాయించింది. రోగుల ఆరోగ్య స్థితి గతులను ఆన్‌లైన్ విధానంలో ట్రాక్ చేసేందుకు ఈ నూతన విధానం అమల్లోకి తీసుకు వచ్చారు. ఆస్పత్రికి వచ్చిన రోగులను అభ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేస్తారు. ఆసుపత్రికి వచ్చినవారందరూ ముందుగా ఓపీ చీటి తీసుకోవాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో రోగి వ్యక్తి గత సమాచారం, ఫోన్ నెంబరు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తే వెంటనే ఓటీపీ వస్తుంది. ఈ ఓటీపీని నమోదు చేస్తే రిజిస్ట్రేషన్ నెంబరు జనరేట్ అవుతుంది. వైద్యాధికారి రిజిస్ట్రేషన్ నెంబరు కంప్యూటర్‌లో నమోదు చేసి రోగిని పరీక్షించి ఆన్‌లైన్‌లో మందుల వివరాలు నమోదు చేస్తారు. ఈ మందుల వివరాలు ఫార్మాసిస్ట్‌కు వెళ్తాయి. రోగి రిజిస్ట్రేషన్ నెంబరు ఆధారంగా ఫార్మాసిస్టు వైద్యాధికారి సూచించిన మందులు అందజేశారు. అలాగే రక్త పరీక్షలు, ఇతర పరీక్షలు ఉన్న రిజిస్ట్రేషన్ నెంబరు ఆధారంగానే ఆన్‌లైన్ విధానం ద్వారా రిపోర్టులు రోగి ఎప్పుడు ఆస్పత్రికి వచ్చినా, ముందు వైద్యుల నుంచి పొందిన చికిత్స, మందుల ప్రిస్కిప్షన్, ల్యాబ్ రిపోర్టులు ఆన్‌లైన్‌లో కన్పిస్తాయి. దీంతో రోగికి చికిత్స అందించటం సులభమవుతుంది. రోగి తన వెంట ఓపీ చీటి, రిపోర్టులు తీసుకొని వెళ్లాల్సిన అవసరం ఉండదు. రోగి ప్రిస్కిప్షన్, ల్యాబ్ రిపోర్టులు, రిజిస్ట్రేషన్ నెంబరు ఆధారంగా హార్డ్ కాపీలు తీసుకోవచ్చు. ఈ ఆన్‌లైన్ విధానం మరి కొద్ది నెలల్లో పూర్తి స్థాయిలో రోగులకు అందుబాటులోకి వస్తుందని వైద్యులు చెపుతున్నారు. ప్రస్తుతం ఓపీకి మాత్రమే ఆన్‌లైన్ విధానం అమలు చేస్తున్నారు. ఇది అమలులోకి వస్తే ఏరియా ఆసుపత్రులకు చికిత్స కోసం వచ్చే రోగులు ఫోన్ కచ్చితంగా తీసుకు రావాల్సిందే.

ఎఫ్ఎస్‌టీపీ ప్లాంట్ ప్రారంభంపై కదలిక

● పర్యావరణ పరిరక్షణ - భూగర్భ జలాల సంరక్షణే ధ్యేయంగా నిర్వహణ ● అక్టోబరు 2 నుంచి అమలుకు ప్రణాళికలు



రామాపురంలోని ఎఫ్ఎస్‌టీపీ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న డీఈ

చీరాల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణతో పాటు భూగర్భ జలాల సంరక్షణే ధ్యేయంగా రామాపురంలో ఏడాది క్రితం నిర్మించిన ఎఫ్ఎస్‌టీపీ (వ్యర్థాలు సేకరణ) ప్లాంట్‌పై అధికారుల్లో కదలిక వచ్చింది. సాధారణంగా ఇప్పటి వరకు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో కొందరు సెప్టిక్ ట్యాంకర్ల నిర్వాహకులు లోడ్ చేసిన మలినాలను జాతీయ రహదారి వెంబడి, దండుబాట రోడ్డు, కారంచేడు రోడ్డుల్లోని నిర్మానుష్యమైన ప్రదేశాల్లో వదులుతున్నారు. అయితే ఈక్రమంలోని వ్యర్థాల కారణంగా రాకపోకలు సాగించే ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వీటి వలన పలు వ్యాధులు ప్రబలే అవకాశం లేకపోలేదు. ఈ వ్యర్థాల వలన పర్యావరణం దెబ్బతినడంతో పాటు, భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయి.

ప్లాంట్ నిర్మాణంతో ప్రయోజనం

కేంద్ర ప్రభుత్వం, పర్యావరణ పరిరక్షణ, భూగర్భ జలాల సంరక్షణే ధ్యేయంగా ఎఫ్ఎస్‌టీపీ ప్లాంట్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. అందుకు సంబంధించి రూ.2కోట్లు నిధులు కూడా మంజూరు చేసింది. దీంతో రామాపురంలో మున్సిపల్ అధికారులు ప్లాంట్ నిర్మాణం చేపట్టారు. మున్సిపల్ పరిధిలో ట్యాంకర్ల ద్వారా లోడు చేసిన మలినాలను ప్రజాసంచార ప్రాంతాల్లో ఇబ్బందులు కలుగకుండా ప్లాంట్‌లో నిర్మించిన 2500 కిలోలీటర్లు సామర్థ్యం ఉన్న ట్యాంకర్‌లలోకి చేర్చనున్నారు. అలాగే మున్సిపల్ పరిధిలోని ట్యాంకర్ల నిర్వహణ దారులకు కచ్చితమైన రిజిస్ట్రేషన్‌లతో నిర్వహణ సాగించేలా ప్రణాళిక చేపట్టారు. వీటి ద్వారా ఏదయినా ఇంటి యజమానికి ట్యాంకర్ అవసరమైనప్పుడు టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా మాత్రమే వాహన సౌకర్యం కల్పించనున్నారు. అయితే ఈ విధమైన ప్రక్రియకు గతంలోనే పూనుకున్నా కాలక్రమేణ అధికారులు అటువైపు కన్నెత్తి చూడలేదు. అయితే ప్రభుత్వం అక్టోబరు 2 స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్లాంట్ల నిర్వహణ అమల్లోకి తీసుకు రానుండడంతో అధికారులు తిరిగి వాటిపై దృష్టి సారించారు.

స్వచ్ఛ చీరాలే లక్ష్యంగా ప్లాంట్ నిర్వహణ

చీరాల పురపాలక సంఘాన్ని స్వచ్ఛ చీరాలగా మార్చేందుకు అన్నివిధాలుగా కృషిచేస్తున్నాము. ఈ నేపథ్యంలో నిర్మించిన ప్లాంటును అక్టోబరు 2 నుండి అమల్లోకి తీసుకురానున్నాము. అందుకు సంబంధించి ట్రయిల్‌రన్ కూడా చేశాము. ట్యాంకర్ల నిర్వహణ దారుల తో వెంటనే సమావేశం నిర్వహించి, టోల్ ఫ్రీ నంబరును అందుబాటులో ఉంచనున్నాము. రవాణా పారదర్శకంగా ఉండేలా వాహన ట్రాకర్ ఏర్పాటు కూడా ఏర్పాటు చేస్తున్నాం. **- రఘురామ్, మున్సిపల్ డీఈ**

వరిసాగుకు రైతులు సన్నద్ధం

● ముందుగానే నీరు విడుదల కావడంపై రైతుల్లో జోష్
● ఊపందుకున్న నారుమడుల పెంపకం
● పదిరోజుల్లో ప్రారంభంకానున్న నాట్లు



పొలాల్లో సాగులో ఉన్న వరి నారుమడులు

బల్లికురవ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది సాగర్ నుంచి ముందుగా నీటిని విడుదల చేయడంతో రైతులు మాగాణి సాగుకు సన్నద్ధం అవుతున్నారు. ఇప్పటికే పలు గ్రామాలలో రైతులు వరి నారు మడులు సాగుచేశారు. ప్రస్తుతం 20 రోజుల నారు ఉండగా, మరో పదిరోజుల్లో నాట్లు ముమ్మరం కానన్నాయి. బల్లికురవ మండలంలోని గుంటుపల్లి, అంబడిపూడి, వల్లాపల్లి, కొమ్మినేనివారిపాలెం, వైదన, ముక్తేశ్వరం, సూరేపల్లి, ఎస్ఎల్. గుడిపాడు, కొప్పెరపాడు, కొత్తూరు, వెలమవారిపాలెం, గొర్రెపాడు, కూకట్లపల్లి, కొప్పెరపాలెం, నక్కబొక్కలపాడు, చెన్నుపల్లి గ్రామాలలో సుమారు 6 వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేయనున్నారు. ఎరువులు కూడా కొనుగోలు చేసి కొందరు ఇళ్లల్లో నిల్వలు పెట్టారు. గతం కంటే ఈ ఏడాది ముందుగా మాగాణి సాగవుతుందని రైతులు పేర్కొంటున్నారు. కొందరు కౌలురైతులు ఇప్పటికే పంటసాగుకు ముందస్తు కౌలు కూడా చెల్లిస్తున్నారు. డ్యాంలలో ఫుల్‌గా నీరు ఉండటంతో రైతులు రెండు పంటలు పండించేలా సాగుకు సిద్ధం అవుతున్నారు. వరి సాగు ముగిసిన తర్వాత మొక్కజొన్న వేసేందుకు పలువురు రైతులు సిద్ధం అవుతున్నారు. మొత్తం మీద మరో పది రోజుల్లో గ్రామాలలో రోజు వారీ కూలీలకు పనులు జోరు అందుకోనున్నాయి.



ఏబీసీలో ప్రవహిస్తున్న సాగర్ జలాలు

భవిష్యత్తుకు మార్గదర్శకంగా శిక్షణ తరగతులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మోహనరావు

అద్దంకిటౌన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): కేఆర్‌కేలోని జవహర్ నాలెడ్జ్ సెంటర్(జేకేసీ)లోని శిక్షణ తరగతులు విద్యార్థుల భవిషత్తుకు మార్గదర్శకం చేస్తాయని ప్రిన్సిపాల్ డాక్టర్ వి.మోహనరావు అన్నారు. సోమవారం కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జేకేసీ సెంటర్‌లో నూతన బ్యాచ్‌కు తరగతులను ప్రారంభించారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ ముఖ్య అతిథిగా శిక్షణ ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్.ప్రిన్సిపాల్ ఎం.సత్యనారాయణ, జేకేసీ సమన్వయకర్త డాక్టర్ ఎస్.షర్మిలరాణి, ప్లేస్‌మెంట్ అధికారి ఏ.శిఖామణి, జేకేసీ మెంటర్ వినుకొండ రమేష్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మట్టి వినాయకుడిని పూజిద్దాం

అద్దంకిటౌన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మట్టి వినాయక విగ్రహాలను పూజిస్తే ఎటువంటి కాలుష్యం ఉండదని, వాటిని నీటిలో కలపడం ద్వారా నీరు కూడా కలుషితం కాదని బొమ్మనంపాటు జడ్పీ హైస్కూల్ హెచ్ఎం సీహెచ్‌వీ శ్రీనివాసమూర్తి అన్నారు. సోమవారం పాఠశాలలో తాటిబోయిన వెంకటేశ్వర్లు కుమారుడు వెంకట సుబ్బారావు (వెంకటేశ్వర సీడ్స్) వినాయక చవితి పండుగ సందర్భంగా వందకు పైగా మట్టి వినాయక విగ్రహాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పలువురు గ్రామస్థులు విద్యార్థులు పాల్గొన్నారు.

23 మండపాలకు అనుమతి

ఇంకొల్లు,ఆగస్టు 25,(ఆంధ్రజ్యోతి) : మండలంలో వివిధ గ్రామాలలో వినాయకచవితి సందర్భంగా విగ్రహాలు మండపాలను ఏర్పాటు చేసుకునేందుకు సోమవారం వరకు 23 కమిటీలకు అనుమతులు ఇచ్చినట్లు ఎస్సై సురేష్ తెలిపారు. ఇప్పటి వరకు 30 మండపాలకు ధరఖాస్తులు చేసుకున్నారన్నారు. విగ్రహాల ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతులు పొందాలన్నారు.

ఆటోను ఢీకొన్న కారు

ఒకరి మృతి, ఐదుగురికి గాయాలు

సంతమాగులూరు ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) మండలంలోని పుట్టావారిపాలెం (అడ్డరోడ్డు) -సంతమాగులూరు గ్రామాల మధ్య ఉన్న నక్కల వాగు సమీపంలోని గుంటూరు-కర్నూలు రహదారిపై సోమవారం సాయంత్రం కారు-ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, ఐదుగురుకి తీవ్ర గాయాలయ్యాయి. అందిన వివరాలు ప్రకారం మండలంలోని సజ్జాపురం ఎస్సీ కాలనీకి చెందిన ఏడుగురు వ్యక్తులు పల్నాడు జిల్లా శావల్యాపురం మండలం పోట్లూరు గ్రామానికి ఒక పరిష్కార పంచాయితీకి ఆటోలో వెళ్లారు. అనంతరం అక్కడనుండి తిరిగి ఆటోలో సజ్జాపురం వస్తుండగా మార్గ మధ్యలో అడ్డరోడ్డు దాటిన తర్వాత నక్కలవాగు వంతెన వద్ద వినుకొండ వైపు నుంచి నరసరావుపేట వెళుతున్న కారు అతివేగంగా ఆటోను ఢీకొంది. దీంతో ఆటో తిరగబడింది. దీంతో ఎస్సీ కాలనీకి చెందిన నంబూరి దావీదు (62) అక్కడికక్కడే మృతి చెందాడు. అదే కాలనికి చెందిన వారు దాసరి రోశయ్య, అనంతపురం కోటేసు, దాసరి బాబు, పత్తిపాటి పిచ్చిబాబు, పత్తిపాటి లాజర్‌కు గాయాలయ్యాయి. మృతుడు నంబూరు దావీదుకు ముగ్గురు పిల్లలున్నారు. భార్య ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందింది. గ్రామంలో వ్యవసాయ కూలి పనులు చేసుకుని జీవిస్తున్నాడు. ఘటనా స్థలాన్ని ఎస్‌ఐ పట్టాభిరామయ్య పరిశీలించారు. క్షతగాత్రులను, మృతదేహాన్ని నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారును నరసరావుపేట వద్ద పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కారు అతివేగంగా నడపడం వల్లే ప్రమాదం జరిగిందని పోలీసులు తెలుపుతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఊపందుకున్న వినాయక విగ్రహాల అమ్మకాలు

ఇంకొల్లు, ఆగస్టు 25, (ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లులో వినాయక విగ్రహాల అమ్మకాలు ఊపందుకున్నాయి. సోమవారం ఉదయం నుంచే విగ్రహాలను పెద్దఎత్తున గ్రామాలకు తరలించారు. ముందుగా వినాయక విగ్రహాలను రిజర్వు చేసుకోగా సోమవారం విగ్రహాలను తరలించడం ప్రారంభించారు. పర్చూరు రోడ్డులో విగ్రహాల తయారీ కుటీరం నుంచి భక్తులు విగ్రహాలను కొనుగోలు చేయడం ప్రారంభించారు. రూ.200లతో ఇంటిలో పెట్టుకొనే విగ్రహాల నుంచి ఎత్తును బట్టి రూ.25000 వరకు తయారీదారులు వినాయక విగ్రహాలను అమ్మకానికి సిద్ధంగా ఉంచారు.



మండపాలకు తరలించేందుకు సిద్ధంగా ఉన్న విగ్రహాలు

అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

పర్చూరు, అగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : పర్చూరులో వేంచేసిన శ్రీ అభయాంజనేయ స్వామివారి ఆలయంలో సోమవారం ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు సమకూర్చిన మకరతోరణంతో స్వామి వారిని అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు బృందావనం సత్యనారయణ మాట్లాడుతూ స్వామి వారిని మరక తోరణంతో అలంకరిస్తే గ్రామం సుభిక్షంగా ఉంటుందన్నారు. అనంతరం భక్తులకు ప్రసద వినియోగం చేశారు. కార్యక్రమంలో కోటా శ్రీనివాసరావు, సింహదాటి శ్రీనివాసరావు, సోమరౌతు నాగరాజు, అనిల్‌ప్రసాద్, తులసి శివయ్య పాల్గొన్నారు.



స్వామివారికి పూజలు చేస్తున్న భక్తులు

విద్యార్థులకు విద్యతోపాటు సామాజిక అంశాలపై అవగాహన ఉండాలి

● ఎంఈవో వెంకట్రామయ్య

పర్చూరు, అగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : విద్యతోపాటు సమాజిక అంశాలపై అవగాహన కలిగి ఉండాలని ఎంఈవో పి.వెంకట్రామయ్య అన్నారు. సోమవారం మండల స్థాయిలో నిర్వహించిన పోటీపరీక్షల్లో ప్రతిభను చూపిన విద్యార్థులకు స్థానిక ఎంఇవో కార్యాలయం వద్ద బహు మతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం మోదుగుల నాగిరెడ్డి, బావనపల్లి హనుమంతురావు, కోటేశ్వరావు, ఉమామహేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు పంచాయతీల పురోగతిపై శిక్షణ

పంగులూరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి):మండల పరిషత్ కార్యాలయంలో పంచాయితీల పురోగతి సూచిక వర్షన్ 2.0పై మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీవో కె.సుమంత్ తెలిపారు. మండలంలోని గ్రామపంచాయితీల సర్పంచులు ఎంపీటీసీ సభ్యులు, పంచాయితీ కార్యదర్శులు, డిజిటల్, వెల్ఫేర్ అసిస్టెంట్లు ఈ శిక్షణకు హాజరు కావాల్సిందిగా కోరారు.

నూతన కమిటీ చైర్మన్లు బాధ్యతల స్వీకరణ



అద్దంకిలో బాధ్యతలు స్వీకరిస్తున్న నూతన కమిటీ

అద్దంకి, ఆగస్టు25 (ఆంధ్రజ్యోతి): నాగులపాడు సొసైటీ కమిటీ ప్రమాణ స్వీకారం సోమవారం అద్దంకి పట్టణంలోని నంబూరిపాలెంలోని కార్యాలయంలో నిర్వహించారు. చైర్మన్‌గా బొమ్మనంపాడుకు చెందిన యేనుగంటి వెంకటరామయ్య(బాబు), డైరెక్టర్లుగా రామాయపాలేనికి చెందిన మాజీ సర్పంచ్ వేములపాటి సుబ్బరావమ్మ, అద్దంకి పట్టణం దామావారిపాలెం చెందిన సోమేపల్లి వెంకట్రావులు ప్రమాణం చేసి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ వెంకటరామయ్య మాట్లాడుతూ సొసైటీ అభివృద్ధి కి కృషి చేయటంతో పాటు రైతులకు అవసరమైన అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉంచుతున్నామన్నారు. రైతుల అవసరాలకు అనుగుణంగా రుణాలు ఇస్తు న్నట్లు తెలిపారు. అద్దంకి పట్టణ, మండల టీడీపీ నేతలు పలువురు హజరై నూతన కమిటీని అభినందించారు.

మార్టూరు : గ్రామాలలో వ్యవసాయం చేసే రైతులకు సొసైటీలు వెన్నెముక లాంటివని రైతుల అభివృద్ధికి, సంక్షేమానికి కృషి చేయాలని ఏవో లావణ్య అన్నారు. సోమవారం మండలంలోని కోలలపూడి గ్రామంలో సొసైటీ భవనంలో అధ్యక్షుడిగా తాటి నాగార్జున ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు తాటి నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో త్రిమెన్ కమిటి సభ్యులుగా యడవల్లి ఆదినారాయణ, మెట్టెల నాగేశ్వరరావులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో కందిమళ్ల కొండలరావు, వసంతరావు, చినవెంగమాంబ తదితరులు పాల్గొన్నారు.



ప్రమాణస్వీకారం చేస్తున్న నాగార్జున

డీఎస్సీలో కడవకుదురు యువతి సత్తా

చినగంజాం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి) : డీఎస్సీ-2025 ఫలితాలల్లో కడవకుదురు గ్రామానికి చెందిన చిలకాబెన్ సృజన మొదటి ప్రయత్నంలోనే సత్తాసాటి ఎస్‌జీటీకి ఎంపికైంది. సృజన ఎస్‌జీటీ విభాగంలో 83.61 మార్కులు సాధించింది. మైనంపాడు ప్రభుత్వ డైట్ కళాశాలలో 2022వ సంవత్సరంలో డీఈడీ 86 శాతం మార్కులతో ఉత్తీర్ణులైంది. అనంతరం ఒక సంవత్సరం పాటు శిక్షణ తీసుకున్నట్లు సృజన తెలిపారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో మొదటి ప్రయత్నంలోనే ఎస్‌జీటీకి ఎంపికైనట్లు తెలిపారు. తల్లి కృప గృహిణి కాగా, తండ్రి కుమార్ చినగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోషల్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఉపాధ్యాయుని కుమార్తె ఉపాధ్యాయురాలిగా ఎంపిక కావడంపై పలువురు పెద్దలు, ఉపాధ్యాయులు బెన్ సృజనకు అభినందనలు తెలిపారు.



చిలకా బెన్ సృజన

ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు





మార్టూరులో, ఇంకొల్లులో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

పర్చూరు, అగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : యూరియా కొరత పేరుతో అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ పి.బ్రహ్మయ్య హెచ్చరించారు. కలెక్టర్ వెంకటమురళీ ఆదేశాల మేరకు సోమవారం పర్చూరులోని పలు ఎరువుల దుకాణాల్లో రెవెన్యూ, పోలీసు, వ్యవసాయ అధికారులతో కలసి తనిఖీలు నిర్వహించారు. అనంతరం స్టాక్ రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏవో బాస్కర్‌రావు, ట్రైనీ ఎస్సై గోపి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో అధికారుల తనిఖీలు

మార్టూరు : మార్టూరులోని ఎరువుల దుకాణాల్లో సోమవారం తహసీల్దార్ టి.ప్రశాంతి, ఏవో లావణ్యలు తనిఖీ చేశారు. లక్ష్మీ శ్రీనివాస ట్రేడర్స్ దుకాణంలో ఇన్‌వాయిస్ లేవనే కారణంగా, రూ.1,01,250 విలువైన యూరియా అమ్మకాలను నిలిపివేశారు. అనంతరం పద్మ ఫెర్టిలేజర్స్ షాపులో తనిఖీ చేసి సాంకేతిక కారణాలతో ఈపాస్ మిషను పనిచేయకపోవడాన్ని గ్రహించి, మిషను పనిచేసేంతవరకు ఎరువుల అమ్మకాలను నిలిపివేయాలని దుకాణం యజమానికి సూచించారు. అంతకుముందు అమరావతి నూలుమిల్లులో యూరియాను వినియోగిస్తున్నారా..? అనే విషయంపై నూలు మిల్లులో తనిఖీలు చేశారు. అయితే నూలుమిల్లు వారు తాము యూరియాను వినియోగించే అవకాశం లేదని అధికారులకు తెలిపారు. ఈ సందర్భంగా ఏవో లావణ్య మాట్లాడుతూ అన్ని దుకాణాల్లో ఎరువుల తనిఖీలు నిర్వహిస్తామన్నారు. ఎంఆర్‌పీ కన్నా అధిక ధరలు అమ్మితే చర్యలు తీసుకుంటామన్నారు.

ఇంకొల్లు : ఇంకొల్లులోని శ్రీరామచంద్ర ఏజన్సీస్ ఎరువుల దుకాణంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం అధికారులు సోమవారం తనిఖీలు నిర్వహిచారు. యూరియా 211 బస్తాలు ఈపాస్ మిషన్ ప్రకారం ఉండగా గోదాములో 211 బస్తాలు నిల్వఉందని గుర్తించారు. రికార్డులను పరిశీలించారు. ఎరువులకు అధిక ధరకు విక్రయించరాదని దుకాణ యజమానులకు సూచించారు. ఈ తనిఖీలలో ఏవో మేరమ్మతో పాటు తహసీల్దార్ శ్రీనివాస్, ఏఎస్‌ఐ నాగలక్ష్మీ ఉన్నారు. రైతులు ఎవరూ యూరియా కోసం ఆందోళన చెందనవసరం లేదని ముందుగా అధిక ధరలకు కొనుగోలు చేసుకోవద్దని సూచించారు.

సమృద్ధిగా ఎరువులు

అద్దంకిటౌన్ : మండలంలో సమృద్ధిగా ఎరువులు అందుబాటులో ఉన్నయాని కావాల్సిన రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రైవేట్ డీలర్ల వద్ద యూరియా 110 టన్నులు, డీఏపీ 142.5 టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 335 టన్నులు అందుబాటులో ఉన్నాయన్నారు. దీంతో పాటు రైతుసేవా కేంద్రాలల్లో యూరియా 32 టన్నులు, డీఏపీ 74 టన్నులు ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎరువులను అధిక ధరలకు అమ్మినా, యూరియాతో వేరే ఎరువులను లింక్ చేసి అమ్మినా, చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలో ఎరువుల విక్రయాలపై నిఘా ఉంచినట్లు తెలిపారు.

పొగాకు సాగుపై నిషేధం

యద్దనపూడి, (మార్టూరు)ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): యద్దనపూడి మండలంలో పొగాకు సాగు నిషేధమని, ఎవరైనా రైతులు పొగాకును సాగుచేస్తే వారి పంటలను దున్నివేయనున్నట్లు తహసీల్దార్ కే.రవికుమార్ సోమవారం ఒ క ప్రకటనలో తెలిపారు. పొగాకు నర్సరీలను కూడా పెంచవద్దన్నారు. రైతులు పొగాకుకు ప్రత్యామ్నాయంగా శనగ,మొక్కజొన్న, జొన్న పంటలను సాగు చేసుకోవచ్చన్నారు. పొగాకు సాగు నియంత్రణకు మండల స్థాయిలో టాస్క్‌ఫోర్స్ బృందంలో తహసీల్దారు చైర్మన్‌గా, ఏవో సమన్వయకర్తగా, ఎస్‌ఐ మెడికల్ ఆఫీసర్లు సభ్యులుగా కొనసాగుతారన్నారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

చినగంజాం : ఎరువులు, క్రిమిసంహారక మందులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ జీవగుంట ప్రభాకరరావు, ఏవో ఆర్.చంద్రశేఖర్‌లు హెచ్చరించారు. మండలంలోని పెదగంజాం గ్రామంలోని శేషాద్రి ఫర్టిలైజర్, గీతికా ఆగ్రోస్ అండ్ సీడ్స్, బాలాజీ ఫర్టిలైజర్స్ దుకాణాలను వారు తనిఖీ చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మాత్రమే ఎరువులను విక్రయించాలాన్నారు. రైతులకు ప్రస్తుత అవసరాల నిమిత్తం మాత్రమే అమ్మకాలు చేయాలన్నారు. స్టాక్ పెట్టడం, బ్లాక్ మార్కెటింగ్ చేయడం వంటి చర్యలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు.

అవీ..ఇవీ..

సేవా కార్యక్రమాలతో మానసిక సంతృప్తి

చీరాల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : యువత విద్యార్థి దశ నుంచే సామాజికసేవా కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొనడం ద్వారా సంతోషంగా ఉంటారని సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు పేర్కొన్నారు. సోమవారం కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం, పోలీసు, సామాజిక విభాగం(రెఫ్) సంయుక్తంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 100 కళాశాల విద్యార్థులు హాజరై రక్తదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా.జగదీష్, ఏరియా వైద్యశాల బ్లడ్ బ్యాంకు ఇన్‌చార్జ్ నాగిరెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జ్యోతి స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ, మత్తు పదార్థాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న విజయశాంతి

చినగంజాం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాజుబంగారు పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 8, 9, 10 తరగతుల విద్యార్థులకు ఏపీ సాక్స్, జిల్లా ఎయిడ్స్ నివారణ నియంత్రణ సంస్థ చైల్డ్ ఫండ్ ఇండియా లింకు వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో హెచ్ఐవీ ఎయిడ్స్, మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్.ఎం ఆర్.హనుమంతరావు మాట్లాడుతూ విద్యార్థులు హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మత్తుపదార్థలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఆర్.శ్రీనివాసరెడ్డి, లింకు వర్కర్ గున్నమనేని విజయశాంతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అందరిని అక్షరాస్యులుగా మార్చాలి

మేదరమెట్ల, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా గ్రూపుల్లోని మహిళల్లో నిరక్షరాస్యులను గుర్తించి వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని, ఏపీవో గాయత్రిదేవి సూచించారు. సోమవారం కొరిశపాడు మండల సమాఖ్య కార్యాలయంలో ఏపీవో గాయత్రి దేవి ఆధ్వర్యంలో ఉల్లాస్, 'అక్షరాంధ్ర-అక్షరాస్యత' కార్యక్రమంపై మహిళా వీవోఏలు, ఏఫ్ఏలు, సీసీలు, వాలంటీర్లుకు మండల స్థాయి శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా వయోజన విద్యా కార్యక్రమ సమన్వయకర్త టి. శ్రీనివాసరావు పాల్గొని సిబ్బందికి అ వగాహన కల్పించారు. పది మంది నిరక్షరాస్యులకు ఒక వాలంటీరును ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా అంతట ఆగస్టు నెల నుంచి వచ్చే ఏడాది మార్చి వరకు కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం నేర్చుకున్న అంశాలపై మార్చి నెల ఆఖరున ఎఫ్ఎల్ఎన్ఏటీ పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. సమావేశంలో వెలుగు సీసీలు సాంబయ్య, శేషగిరిరావు, శ్రీనివాసరావు, అకౌంటెంట్ సునీత, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మహిళపై దాడి.. కేసు నమోదు

మార్టూరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): స్థానికంగా మద్ది సీతాదేవినగర్‌లో నివాసం ఉంటున్న మేడా కనకమహాలక్ష్మి అనే మహిళ తనపై ఇద్దరు మహిళలు సోమవారం ఇంటి వద్ద దాడిచేసి గాయపరచారని స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం ఫిర్యాది మహాలక్ష్మి భర్త వెంకటేశ్వర్లుకు ఆదిలక్ష్మి అనే మహిళ గత ఏడాది క్రితం రూ.70 వేలను అప్పుగా ఇచ్చారు. ఈ నేపథ్యంలో వెంకమ్మ అనే మహిళతో కలిసి ఆదిలక్ష్మి తన డబ్బులను ఇవ్వాలని మహాలక్ష్మితో మాట్లాతుండగా వారి మధ్య వివాదం జరిగింది. ఈ వివాదంలో. మహాలక్ష్మిని వెంకమ్మ రాయితో కొట్టిందని, గాయపడిన మహాలక్ష్మి స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

విశ్వబంధుత్వ దినోత్సవం సందర్భంగా రక్తదానం



ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న సభ్యులు

అద్దంకిటౌన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): అద్దంకిలోని బ్రహ్మకుమారి, ఈశ్వరియ విశ్వవిద్యాలయంలో సోమవారం విశ్వ బంధుత్వ దినోత్సవంలో భాగంగా రక్తదానం శిబిరం నిర్వహించారు. రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్, రేపల్లె మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వసంతం వీ రరాఘవయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 50మంది రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో అద్దంకి సెంటర్ ఇన్‌చార్జ్ బీకే రామలక్ష్మి, చుండూరి మురళి, కొత్తమాసు సుబ్బారావు, వాసవి క్లబ్, వనిత క్లబ్ సభ్యులు, నాగరాజ కుమారి, వేదవతి, అనుమాయమ్మ, అంజలి, ఆదిలక్ష్మి, సత్యవతి, శ్రీ హర్షిణి కళాశాల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ టవర్‌ను ఢీకొన్న కారు

● భార్యాభర్తలకు స్వల్పగాయాలు
● బెలూన్లు తెరుచుకోవడంతో తప్పిన ప్రాణాపాయం



టవర్‌ను ఢీ కొని దెబ్బతిన్న కారు ముందు భాగం

అద్దంకి, ఆగస్టు25 (ఆంధ్ర జ్యోతి): ఎదురుగా వచ్చే వాహనాన్ని తప్పించే క్రమంలో రోడ్డు అంచులోని విద్యుత్ టవర్‌ను కారు ఢీ కొట్టింది. దీంతో కారు ముందుభాగం పూర్తిగా దెబ్బతినగా, భార్యభర్తలకు స్వల్పగాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు కావలి నుండి హైదరాబాద్‌కు తన్నీరు నాగేశ్వరావు, పాపమ్మలు కారు లో వెళ్తున్నారు. సోమవారం మధ్యాహ్నం అద్దంకి పట్టణంలోని రాజీవ్‌కాలనీ వద్దకు వచ్చేసరికి ఎదురుగా వచ్చే వాహనాన్ని తప్పించే క్రమంలో కారు రోడ్డు అంచులోని విద్యుత్ టవర్ ను ఢీ కొట్టింది. ఆ సమయంలో కారులోని ఎయిర్ బెలూన్లు తెరుచుకున్నాయి. దీంతో భార్యభర్తలు నాగేశ్వరరావు, పాపమ్మలు స్వల్పగాయలతో బయటపడ్డారు. 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఫిజియోథెరపీలో జాగ్రత్తలు పాటించాలి



ఫిజియోథెరపీని పరిశీలిస్తున్న జోత్స్న

వేటపాలెం (చీరాల), ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : భవిత కేంద్రాల్లోని చిన్నారుల పట్ల నిర్వాహకులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా సమగ్ర శిక్ష సహిత విద్య సమన్వయ కర్త జ్యోత్స్న అన్నారు. సోమవారం వేటపాలెం మండలం నాయినిపల్లిలోని ప్రాథమిక పాఠశాల, ఈపూరుపాలెం భావనారుషిపేటలోని భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ తీరును ఆకస్మిక తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రధానోపధ్యాయురాలు శోభాదేవీ, ఫిజియోథెరపిస్టు ధనలక్ష్మీ, శ్రీధర్ పాల్గొన్నారు.